
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

గురువారం 30 జనవరి 2025







పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వద్ద అలంకరించిన ఎర్రజెండాలు

ఎరుపెక్కిన సింహపురి

నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయి. ఈ క్రమంలో నగరమంతా ఎరుపు మయమైంది. ఎటు చూసినా సీపీఎం ఎర్రజెండాలు దర్శనమిస్తున్నాయి. కనకమహాల్ సెంటర్‌లో ఉన్న కమ్యూనిస్టు ఉద్యమనాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే గాంధీబొమ్మ, వీఆర్‌సీ సెంటర్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు కూడలి తదితర ప్రాంతాల్లో ఎర్రజెండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే మినీబైపాస్‌రోడ్డులోని పూలేబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కూడా సీపీఎం జెండాలు ఆకర్షణగా నిలిచాయి.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)

బుచ్చిలో అదృష్ట వంతులెవరో!?

- 3న నగర పంచాయతీ వైస్ చైర్మన్ల ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో రెండు వైస్ చైర్మన్ల ఎంపిక రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు వచ్చే నెల 3వ తేదీన వైస్‌చైర్మన్ల ఎంపిక జరగాల్సి ఉంది. ఈలోపు ఆశావహులు అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2021, నవంబరు 15న నగర పంచాయతీలో 20 వార్డులకు ఎన్నికలు జరిగాయి. 18 స్థానాల్లో వైసీపీ, రెండింట టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. అదే నెల 21న చైర్‌పర్సన్‌గా మోర్ల సుప్రజ, మిగలిన 19మంది కౌన్సిలర్లతో ప్రమాణస్వీకారం చేశారు. 5వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే. షాహుల్, 19వ వార్డు కౌన్సిలర్ కోటంరెడ్డి లలితలను వైస్ చైర్మన్లుగా ఎంపిక చేశారు. అయితే, గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీలోని చైర్‌పర్సన్‌తోపాటు 9మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 11కి చేరడంతో ఇద్దరు వైస్‌చైర్మన్లు రాజీనామా చేశారు. ఈ పదవుల కోసం పలువురు వలస కౌన్సిలర్లలో పోటీ నెలకొంది. నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో హామీలు కూడా పుచ్చుకున్నట్టు అధికార పార్టీలో చర్చనీయాంశమైంది. కాగా, టీడీపీకి చెందిన తాళ్ల వైష్ణవి, జూగుంట కల్యాణ్‌లు 17, 2వ వార్డుల్లో గెలిపొందారు. ఈ ఇద్దరు కౌన్సిలర్లు కాకుండా మిగతా 9మంది వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారే. ఏదిఏమైనా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారం ఉన్నవారికే వైస్‌చైర్మన్ల పదవులు దక్కే అవకాశం ఉండటంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

వైభవంగా త్రై అమావాస్య

త్రై అమావాస్య సందర్భంగా బుధవారం నగరంలోని వీరరాఘవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు జరిగాయి. జిల్లాతోపాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని శివలింగానికి ఉప్పు, మిరియాలు వేసి అభిషేకం చేశారు. అనంతరం వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తల్పగిరి రంగనాథస్వామి స్వర్ణ గరుడుడిపై భక్తులకు దర్శనం ఇచ్చారు. చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



వైద్య వీరరాఘవ స్వామి ఆలయంలో ఉప్పు, మిరియాలతో శివలింగాన్ని అభిషేకిస్తున్న భక్తులు

6



శత కీర్తి



నింగిలోకి పయనమవుతున్న రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - రాకెట్ మూడో దశ - రాకెట్ నుంచి విడిపోయి కక్ష్యలోకి చేరుతున్న నావిక్-02 ఉపగ్రహం

తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి వందవ రాకెట్ విజయవంతంగా రోదసిలోకి దూసుకుపోవడంతో షార్ ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతోంది. ఒకప్పుడు బయటి ప్రపంచాన్ని ఎరుగని ఏనాదులు జీవించే ఒక మారుమూల దీవి, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అంతరిక్ష ప్రయోగ కేంద్రంగా మారిన పరిణామాలను ఈ ప్రాంతపు వాసులు గుర్తు చేసుకుంటున్నారు. తొలి రోజుల్లో షార్ అభివృద్ధిలో భాగం అయిన శాస్త్రవేత్తలు, ఇతర ఉద్యోగులు వందో విజయ సందర్భంలో సంబరపడుతున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు తెలిమంచు తెరలను చీల్చుకుంటూ జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది. ఈ దృశ్యాన్ని ఈ ప్రాంత ప్రజలంతా ఇళ్ల బయటకు వచ్చి ఆనందంతో వీక్షించారు. పొగ చారలు ఆకాశంలో మిగిల్చి అంతరిక్షంలోకి నావిగేషన్ ఉపగ్రహం నావిక్-02 ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి వందవ రాకెట్ చేర్చడంతో షార్ శాస్త్రవేత్తలు ఆలింగనాలూ, కరచాలనాలతో అభినందలు తెలుపుకున్నారు. ఈ విజయం షార్ భవిష్యత్తుకు కూడా కీలకం కానుంది. మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణ నిర్ణయంతో, గత కొన్నేళ్లుగా స్తబ్దుగా మారిన శ్రీహరికోటలో మళ్లీ సందడి నెలకొననుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి ఐదువేల మందిదాగా బుధవారం శ్రీహరికోటకు తరలివచ్చారు. మంచు కురుస్తున్నా చలిని సైతం లెక్కచేయకుండా గ్యాలరీలో కూర్చున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు వాహనాలు తెల్లవారుజామునుంచే బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో చప్పట్లు, ఈలలు, కేరింతలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

విద్యార్థులతో కలిసి వీక్షించిన కలెక్టర్

సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాకెట్ ప్రయోగాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దంపతులు, ఆర్డీవో కిరణ్మయి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షించారు. సైన్సు ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హిమ, అన్నిని లకు కూడా కలెక్టర్‌తో పాటు మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న 500 మంది విద్యార్థులకు రాకెట్ ప్రయోగాన్ని విజిటర్స్ గ్యాలరీ నుంచి వీక్షించే అవకాశం కల్పించారు.



మిషన కంట్రోలర్ సెంటర్‌లో ఇస్రో చైర్మన్ నారాయణన్, షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఆర్డీవో కిరణ్మయి, విద్యార్థులు



రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఇస్రో మాజీ చైర్మన్లు



మంచు తెరలు చీల్చుకుంటూ..
నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన వందో రాకెట్

రాకెట్ వీక్షణకు మాజీ ఇస్రో చైర్మన్‌లు..

షార్ వేదికగా జరిగిన వందో రాకెట్ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ ఎస్.సోమనాథ్, డాక్టర్ కె.రాధాకృష్ణ, శివన్, ఏఎస్.కిరణ్ కుమార్ శ్రీహరికోటకు వచ్చారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు. వందో ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ ప్రకటించగానే ఆనందోత్సాహాలు ప్రకటించారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు (విద్య), జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉదయభాస్కర్‌రావు అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్ ఒకేషనల్, 10వ తేదీ నుంచి ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా కంట్రోల్ రూమ్ నుంచిపటిష్ఠ భద్రత నడుమ ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో కుర్చీలు, ఫ్యాన్స్ మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు అవసరమైన ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్ఐఓ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 141 సెంటర్లలో ఇంటర్ ప్రాక్టికల్స్, 79 సెంటర్లలో సాధారణ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రాక్టికల్స్‌కు 25,782 మంది, ప్రధాన పరీక్షలకు 54,200 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. సమస్యలు, సందేహాల నివృత్తికి 0861-2320312 ఫోన్ నెంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మునిసిపల్ అదనపు కమిషనర్ ఒ.నందన్, డీఎంహెచ్‌వో సుజాత, డీఈఓ బాలాజీరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, డీవీఈఓ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవో ఆదూరు శ్రీనివాసులు కేఏసీ కళాశాలలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అన్ని కళాశాలలకు పరీక్ష సామగ్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో డీవీఈఓ మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాస రావు, రాజారెడ్డి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ పుంజుకునేనా!?

- 2023తో పోలిస్తే భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు
- 65.58 శాతం మించని లక్ష్యం
- ఎన్నికల ప్రభావమంటున్న ఆర్థిక నిపుణులు
- 2024, డిసెంబరులో ఆశాజనకంగా అమ్మకాలు
- అదే ఊపు కొనసాగుతుందని ఆశాభావం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : కీలకమైన రియల్ ఎస్టేట్ రంగం గతేడాది ఒడిదుడుకులు ఎదుర్కొంది. అంచనాలకు తగ్గట్లుగా క్రయ, విక్రయాలు జరగలేదు. రిజిస్ట్రేషన్ శాఖ వివరాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఎన్నికల ఏడాది కావడంతోనే ఈ పరిస్థితి ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఎప్పుడూ ఎన్నికల ఏడాదిలో రియల్ ఎస్టేట్ రంగం స్తబ్దుగా ఉంటుందని గుర్తు చేస్తున్నారు. మనీ ఫ్లో అనేది ప్రభుత్వ పాలసీల మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి కొత్త ప్రభుత్వ నిర్ణయాల మేరకు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మార్పులు కనిపిస్తాయని విశ్లేషిస్తున్నారు. 2023లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.485.57 కోట్లు రెవెన్యూ వసూళ్ల రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 82,045 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో రూ.362.49 కోట్లు వసూలు చేసి 74.65 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. అదే 2024లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.516.47 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 71,757 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో రూ.338.68 కోట్లు వసూలు చేసి 65.58 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. అంటే ఎన్నికల ఏడాదిలో తొమ్మిది శాతం మేర రిజిస్ట్రేషన్లు తగ్గాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి 9.02 శాతం గ్రోత్ రేటు నమోదవగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి - 6.57 శాతానికి గ్రోత్‌రేటు తగ్గడం గమనార్హం. అయితే అనూహ్యంగా 2024, డిసెంబరులో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. అంతక ముందు నెలలతో పోలిస్తే ఈ నెలలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది మొత్తం సరాసరి 6.57 శాతం గ్రోత్ రేటు తక్కువగా నమోదైతే డిసెంబరులో మాత్రం 12.86 శాతం పెరగడం విశేషం. 2023, డిసెంబరుతో పోలిస్తే 2024 డిసెంబరులో పది శాతం ఎక్కువగా పురోగతి కనిపించింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపార వర్గాల నుంచి ఆనందం వ్యక్తమవుతోంది. ఇదే ఊపు రానున్న రోజుల్లో కూడా కొనసాగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి ఆరు నెలలు రియల్ ఎస్టేట్ రంగం నెమ్మదిగా కదిలింది. అయితే ఇప్పుడు ప్రభుత్వం కుదురుకోవడం, కొత్త పాలసీలు ప్రారంభమవడంతో వాటికి ప్రజలు అలవాటుపడుతున్నారు. దీంతో భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు కొనుగోలుదారులు ముందుకొస్తున్నారని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు, మూడు నెలలు కూడా ఇదే విధంగా రియల్ ఎస్టేట్ పుంజుకుంటే ఆ తర్వాత కొత్త లేఅవుట్లు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే స్థలాలకు ఉన్న డిమాండ్ అపార్ట్‌మెంట్లలో ప్లాట్లకు, గృహాలకు ఉండడం లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గత నెలలో జరిగిన రిజిస్ట్రేషన్లలో కూడా ఎక్కువగా స్థలాలే ఉన్నాయని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

కుష్ఠును ఎలా గుర్తిస్తున్నారు!?

- సర్వేపై కేంద్ర బృందం ఆరా



మనుబోలు : పిడూరులో కుష్ఠు వ్యాధి సర్వేపై ఆరా తీస్తున్న కేంద్ర బృంద అధికారులు రంగనాథ్, అక్షర్ పురోహిత్

నెల్లూరు (వైద్యం)/ మనుబోలు/కొడవలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి సర్వేపై బుధవారం కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ బృందం ఆరా తీసింది. జిల్లాలోని కొడవలూరు, మనుబోలు పీహెచ్‌సీలతోపాటు నగరంలోని జీజీహెచ్‌లో ఉన్న కుష్ఠు వ్యాధి విభాగాన్ని న్యూఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు రంగనాథ్, అక్షర్ పురోహిత్ జిల్లా వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రులలో రికార్డులు పరిశీలించి, బాధితులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే, ఎల్‌సీడీసీ సర్వే తీరును క్షేత్రపరిశీలన చేసి ఆశాలను, ఏఎన్ఎంల నుంచి సర్వే విధానంపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ ముందుగా వ్యాధిని గుర్తించడం, ముందుగానే మందులు అందించి నివారించడం అనే నినాదంతో కేంద్రం పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో కుష్ఠువ్యాధికి సంబంధించి 132 కేసులు ఉన్నాయని, ఈ సంఖ్య ఇంకా తగ్గాలని అన్నారు. వ్యాధిరాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వారివెంట జిల్లా అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ, రాష్ట్ర ఎన్ఎల్ఈపీ అధికారి జావీద్, ప్రియదర్శిని, జోనల్ కో-ఆర్డినేటర్ సతీష్, జిల్లా లెప్రసీ నివారణ అధికారి సురేంద్రబాబు, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు ఉన్నారు.



గంగాభవానికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి, తదితరులు

ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా గంగాభవాని

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా గంగాభవాని నియమితుల య్యారు. బుధవారం ఆమె ఐసీడీఎస్ కార్యాలయంలో బా ధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పీడీ సుజాత సెలవుపై వెళ్లడంతో గంగాభవానిని ఇన్‌చార్జిగా నియ మించారు. ఆమెకు అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి, ఐసీడీఎస్ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ రాక

నెల్లూరు(హరనాథపురం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీశాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం రాత్రి 8గంటలకు నెల్లూరుకి చేరుకుంటారని ఐఅండ్‌పీఆర్ డీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 9గంటలకు నెల్లూరు, ప్రకాశం జిల్లాల మైనార్టీ సంక్షేమాధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు టీడీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి మూడు గంటల వరకు కలెక్టరేట్‌లో ఎస్పీ, జేసీలతో సమీక్ష నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.



వైద్య వీరరాఘవ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వైభవంగా చైత్ర అమావాస్య

● బారులు తీరిన భక్తులు

రోగ నివారణ, ఆరోగ్య, సుఖశాంతులు ప్రసాదించే వైద్య వీరరాఘవ స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. చైత్ర అమావాస్య సందర్భంగా నగరంలోని రామ్‌నగర్‌లోని వైద్య వీరరాఘవ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని శివలింగానికి ఉప్పు, మిరియాలు వేసి అభిషేకం చేశారు. అనంతరం వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, వీఐపీ పాసుల ప్రవేశం వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. పోలీసులు ఉన్న తాధికా రుల సేవలో తరించడంతో సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడింది. టికెట్ల క్యూలైన్లలోనే దర్శ నం 2గంటలు పట్టిందని, పోలీ సులు పర్యవేక్షించి ఉంటే త్వరగా దర్శనం అయ్యేదని భక్తులు విచారం వ్యక్తం చేశారు. జనసేన నాయకులు గును కుల కిషోర్, బీజేపీ నాయకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

డిప్యుటేషన్లపై కొరడా

- రద్దు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆదేశాలు
- అయినా కొనసాగుతున్న కొందరు అధికారులు, సిబ్బంది
- యథావిధిగా వేతనాలు ఇస్తున్నారని విమర్శలు
- తాజాగా విభాగాల మార్పు

నెల్లూరు (వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లపై డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత కొరడా ఝులిపించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్లు రద్దు చేస్తూ వారిని హడలెత్తిస్తున్నారు. అయితే డీఎంహెచ్‌వోపై కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా ఒత్తిడి తెలుస్తున్నట్లు తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి అనుమతితోనే డిప్యుటేషన్లు రద్దు చేస్తున్నామని డీఎంహెచ్‌వో చెబుతున్నారు. దీంతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన మొదలైంది.

● **15 మంది బదిలీ**

తాజాగా 15 మందిని వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్‌గా రషీద్‌ను నియమించారు. కాగా ఒంగోలు నుంచి ఇక్కడకు డిప్యుటేషన్‌పై వచ్చిన సూపరింటెండెంట్ పరిస్థితి ఏమిటో తెలియని పరిస్థితి ఉంది. అకౌంట్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విజయకుమారిని నియమించారు. వైద్యులు, ఉద్యోగులకు సంబంధించి ఎఫ్ఆర్ఎస్‌కు సర్వీస్ ఇంజనీర్‌ను నియమించారు. ఆయనకు అసిస్టెంట్‌గా సపోర్టింగ్ ఇంజనీర్‌ను నియమించారు. వీరితోపాటు మరో 11 మందిని వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఈ క్రమంలో ఎస్టాబ్లిస్‌మెంట్ సూపరింటెండెంట్‌గా ఒంగోలు నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వెంకటేశ్వరరావు వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి కలిసినట్లు తెలిసింది. దీంతో డీఎంహెచ్‌వోకి డైరెక్టర్ ఫోన్ చేసి ఎస్టాబ్లిస్‌మెంట్ సూపరిండెంట్‌గా ఆయన్నే కొనసాగించాలని ఆదేశిచ్చినట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని వైద్యాధికారులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితిలో ఉన్నతాధికారుల ఆదేశాలతోతప్ప అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్‌లు రద్దు చేయవద్దని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి.

● **రద్దు చేసినా అక్కడే...**

వైద్య ఆరోగ్యశాఖలో గతంలో డిప్యుటేషన్లు రద్దు చేసిన 15 మందిలో 8 మంది జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతున్నారు. వీరికి నెలవారీ వేతనాలు, ఎఫ్ఆర్ఎస్ ఎవరు ఇచ్చారన్న విమర్శలు లేకపోలేదు. డిప్యుటేషన్‌లు రద్దు చేసిన వారు పీహెచ్‌సీలకు పోవాలి. అక్కడ వైద్యాధికారులే నెలవారీ వేతనాలు పెట్టాలి. ఇందుకు విరుద్ధంగా వారికి వేతనాలు ఎలా వస్తున్నాయే అర్థం కావటం లేదని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఫైలేరియా విభాగంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్ల డిప్యుటేషన్లను గత డిసెంబరు 26న రద్దు చేశారు. క్షయ విభాగంలో అల్లీపురం నుంచి హెల్త్ సూపర్‌వైజర్ డిప్యుటేషన్‌పై ఉన్నారు. డీఐవో సెక్షన్‌లో సౌత్‌మోపూరు పీహెచ్‌సీకి చెందిన హెల్త్ ఎడ్యుకేటర్ ఉన్నారు. ఇస్కపాళెం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన హెల్త్ అసిస్టెంట్ ఉన్నారు. అలాగే డెమో సెక్షన్‌లో కసుమూరు నుంచి వచ్చిన హెల్త్ ఎడ్యుకేటర్ ఉన్నారు. ఎస్‌వో విభాగంలో హెల్త్ అసిస్టెంట్, అలాగే ఎస్‌వో విభాగంలో ఇద్దరు డీఈవోలు ఉన్నారు. చిరమన పీహెచ్‌సీ నుంచి ఫార్మాసిస్ట్, మరో హెల్త్ అసిస్టెంట్ కూడా జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతున్నారు.

డైరెక్టర్ అనుమతితోనే ఉత్తర్వులు



వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశాలతోనే డిప్యుటేషన్లు రద్దు చేశాం. రద్దు చేసిన వారు వారికి కేటాయించిన ఆరోగ్య కేంద్రాలలోనే వైద్య సేవలు అందించాలి. అయినా కొందరు జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతుం డటం నా దృష్టికి రాలేదు. అలాంటి వారికి గుర్తించి వెంటనే వెళ్లాలని ఆదేశాలిస్తున్నాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత





మినీ బైపాస్.. బడా బిజినెస్!

- వెలుస్తున్న బంగారు, వస్త్ర షోరూంలు
- మొబైళ్లు, ఎలక్ట్రానిక్ దుకాణాలూ ఎక్కువే
- చిరుతిండ్ల నుంచి భారీ హోటళ్లూ అందుబాటులోకి..
- నిత్యం రద్దీగా మారుతోన్న రహదారి

విశాలమైన రోడ్డు.. ఒకవైపు నివాసాలు.. మరోవైపు కాలువ.. రోడ్డు వెంబడి వ్యర్థాలు, చెత్తా చెదారం.. రైళ్ల కూత తప్ప జనాల తాకిడి పెద్దగాలేని నిశ్శబ్ద ప్రాంతం.. ఇదంతా ఒకప్పుడు..

నేడు.. అదో వ్యాపార కేంద్రం.. కూరగాయలు, పండ్లు, చిరుతిండి, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వంటి చిరు వ్యాపారాలతోపాటు పేరెన్నికగల బంగారం, వస్త్ర, మొబైళ్ల దుకాణాలు, ఫ్యాషన్ వేర్స్, ఫ్యామిలీ దాబాలు, జాతీయస్థాయి హోటళ్లు విచ్చలవిడిగా వెలిశాయి. ఐదారేళ్ల క్రితం వరకూ పెద్దగా సందడిలేని నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డు ప్రాంతం ఇప్పుడు నిత్యం జనం, వాహన రాకపోకలతో కిక్కిరిసిపోతోంది.

నెల్లూరు నగరంలో ట్రంకురోడ్డుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. పేద, మధ్యతరగతితోపాటు ఉన్నతస్థాయి వర్గాలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉండే ప్రాంతం. మహిళలకు, పిల్లలకు, యువతకు అవసరమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు, మొబైళ్లు, ఎలక్ట్రానిక్ సామగ్రి ఇలా ఏ వస్తువు కావాలన్నా ట్రంకురోడ్డుకు చేరుకోవాల్సిందే. అంతేగాక ఆహారప్రియులు మంచి భోజన కేంద్రాలు ఉన్నాయి. అయితే, ఇప్పుడు ఈ వ్యాపారమంతా నెల్లూరు మినీబైపాస్ బాట పట్టింది. పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాలు వెలిశాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లకు చెందిన షోరూములూ అందుబాటులోకి వచ్చాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు మినీబైపాస్‌లోనే దొరుకుతున్నాయి. అంతేకాదండోయ్... భోజన ప్రియుల కోసం రోడ్డు పొడవునా పాయ, దోశ, పుల్కాలతోపాటు పానీపూరి వంటి చిరుతిండ్ల నుంచి డాబాలు, రెస్టారెంట్లు, కేఎఫ్‌సీ, డామినోస్ వంటి బ్రాండెడ్ కంపెనీలు తమ కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ట్రంకురోడ్డులో షాపింగ్ చేయాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండటంతో అత్యధిక శాతంమంది మినీబైపాస్‌నే ఎన్నుకుంటున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏహెచ్ జేడీ రమేష్‌నాయక్ తదితరులు


జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

● పశుసంవర్థక శాఖ జేడీ రమేష్ నాయక్

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): జంతువుల సంరక్షణ అందరి బాధ్యత అని పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి 30వరకు పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో గల చైతన్య భారతి పాఠశాల్లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధికుక్కలపై మానవత్వంతో మెలగాలని, జంతువుల సంక్షేమం సామాజిక బాధ్యతని తెలిపారు. జంతు సంరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకరించాలన్నారు. జంతువులకు హానికలిగిస్తే జరిమానాలతోపాటు శిక్షలు విధించేలా చట్టాలు రూపొందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జంతు సంరక్షణ, జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ షీప్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఏడీ మాధవీలత, ఫౌండేషన్ ఫర్ ఎనిమల్స్ సభ్యురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై విచారణకు ప్రభుత్వం ఆదేశం

నెల్లూరు (వైద్యం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న నగరంలోని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌పై విచారణకు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుల బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ ఆదేశాలకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. పలు సమావేశాల్లోనూ కలెక్టర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ కలెక్టర్ ఆనంద్ సూపరింటెండెంట్ వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సెలవుపై వెళ్లాలని ఆదేశించారు.



మహాత్ముడి మాటలు నేటికీ ఆచరణీయమే!

● నేటి సామాజిక సమస్యలకు అవే పరిష్కారం ● నేడు జాతిపిత గాంధీజీ వర్ధంతి

ఆత్మకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సత్యం, అహింస, శాంతి, పరమతసహనం.. అనేవి జాతిపిత గాంధీజీ ప్రపంచానికి ఆచరణాత్మకంగా చాటిచెప్పిన సిద్ధాంతాలు. కానీ నేటి సమాజం వీటిని ఏ మేరకు ఆచరిస్తుందో ప్రశ్నించుకుంటే శూన్యమేనని సమాధానమవుతుంది. సత్యం లోపించి అధర్మమే రాజ్యమేలుతుంది. అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయి. ఆహింసకు బదులు హింస తాండవిస్తుంది. ఇక సమాజంలో శాంతి, పరమతసహనం కూడా అడుగంటుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. మరువని మహామనిషి మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ... ఆయనే మన జాతి పిత.. తరాలు మారినా మరువలేని మహా మనిషి గాంధీజీ. ఆయన పేరులోనే గాంభీర్యం, మాధుర్యం, మానవత్వం, సత్యం కనిపిస్తాయి. అందుకే నిత్య జీవనంలో గాంధీజీ ఆదర్శాలు మన సమాజంలో వేళ్లానుకున్నాయి. ఆయన అనుసరించిన మార్గాలు, పాటించిన ఆశయాలు నాటి నుంచి నేటితరం వరకు ప్రపంచానికే ఆదర్శప్రాయం. అందుకే దేశంలో ప్రతి ఒక్కరూ గాంధీజీ గౌరవిస్తూ మరచిపోలేని మహనీయుడిగా గుర్తెరిగి ప్రతి ఏడాది గాంధీ జయంతి, వర్ధంతులను జరుపుకుంటారు.

● **అహింస**

గాంధీజీ హింసతో ఏదీ సాధ్యం కాదన్నారు. అహింసే ఆయుధంగా మనకు స్వాతంత్ర్యం సాధించారు. ఆంగ్లేయులపై అహింసమార్గంలో పోరాటం చేశారు. అందుకే గాంధీజీ అహింసావాదిగా పేరొందారు.

● **అవినీతి**

ప్రజల వ్యక్తిగత ప్రయోజనాల కన్నా సామాజిక శ్రేయస్సుకు ప్రాధాన్యమివ్వడంతో పాటు అవినీతిరహిత సమాజాన్ని గాంధీ కోరుకున్నారు. కానీ సత్యం లోపించి అధర్మమే రాజ్యమేలుతోంది. అవినీతి, అక్రమాలు పేట్రేగుతున్నాయి. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు సైతం అవినీతి కేంద్రాలుగా మారాయి. అవినీతిరహిత సమాజం కోసం సాగాల్సిన కృషి ఎంతో ఉంది.

● **పల్లె ప్రగతి**

దేశానికి పల్లెసీమలే పట్టుగొమ్మలు. దేశ ప్రగతి... పల్లెసీమల అభివృద్ధిపైనే ఆధారపడి ఉందని గాంధీజీ సూచించారు. అయితే జిల్లాలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కొరవడ్డాయి. తాగు, సాగునీటితో పాటు విద్య, వైద్యం, రహదారులు, పారిశుద్ధ్యం, తదితర సమస్యలు తాండవిస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యి ప్రజలు పట్టణాల బాట పడుతున్నారు.

● **అంటరానితనం**

బాపూజీ అంటరానితనాన్ని అమానుషమన్నారు. కానీ స్వాతంత్ర్యం వచ్చి అర్ధశతాబ్దం దాటినా జిల్లాలోని పలు గ్రామాల్లో ఏదోక రూపంలో అంటరానితనం, అస్పృశ్యత కొనసాగుతూనే ఉంది.

● **మద్యపాన నిషేధం**

సమాజానికి మద్యాన్ని దూరంగా ఉంచాలని గాంధీజీ పిలుపునిచ్చారు. మద్యం నిషేధం కోసం ఆయన పోరాటం సాగించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వాలే మద్యంపై ఆదాయం కోసం అర్రులుచాస్తున్నాయి. ఊరూర బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు జరుగుతుండడం గమనార్హం.

● **స్వదేశీ వస్తు వినియోగం**

గాంధీజీ స్వయంగా నూలు వడికేవారు. ఖద్దరు వస్త్రాలను ఎక్కువగా ధరించేవారు. దేశీయ చేనేత దుస్తులను వాడాలని పిలుపునిచ్చారు. కానీ నేటి యువత విదేశీ దుస్తులు, వస్తువుల మోజులో కొట్టుమిట్టాడుతున్నారు. దానివలన ఆర్థికమాన్యం ఏర్పడి రూపాయి విలువ పడిపోతుంది. గాంధీజీ చెప్పినట్లు స్వదేశీ వస్తు వినియోగం చేస్తే... రూపాయి విలువ పెరుగుతుంది. యువత గాంధీజీలా నిరాడంబరంగా జీవించాలి.

గాంధీజీ ఆశయసాధనకు పాటుపడాలి

నేటితరం గాంధీజీ ఆశయ సాధనే లక్ష్యంగా నడుంకట్టాలి. ఆయన అనుసరించిన మార్గాలు, పాటించిన ఆశయాలు నాటి నుంచి నేటి తరం వరకు ప్రపంచానికే ఆదర్శప్రాయమనే విషయాన్ని యువత గుర్తించాలి. ఆయన ఆశయాలను సైతం అందిపుచ్చుకునేదిశగా అడుగులు వేయాలి.

- బీ పావని, ఆర్డీవో, ఆత్మకూరు



మహాత్ముడి ఆశయాలు ఎంతో ఆదర్శం



గాంధీజీ ఆశయాలు ఎంతో ఆదర్శమైనవి. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి ఆయన బోధనలు, ఆచరించిన మార్గాలు ఎంతో అవసరం. సమాజాన్ని బాగుపరచాలంటే గాంధీయవాదమే ఆయుధం. జయంతి, వర్ధంతుల సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించడం కాదు, ఆయన ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే అసలైన నివాళి.

- సీ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆత్మకూరు డివిజన్ కళాకారుల ఏకలవ్య రూపకం, శాస్త్రీయనృత్యాలు, సుందరయ్య కాలనీ సెట్యూట్ సుందరయ్య, డప్పుల విన్యాసం, చిట్టిబాబు డాన్స్ ఈవెంట్స్ , సుందరయ్య నగర్ కళాకారుల చిన్నారి మల్లి, వీరతెలంగాణ నాటిక, తిరుపతి కళాకారుల బడిగంటలు, పద్యనాటికం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ రంగస్థల నటి రేబాల లక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు , ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్, మంగల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



కార్మిక వ్యతిరేక చర్యలను ఎదుర్కోవాలి

● తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

నెల్లూరు (వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో పారిశ్రా మికవేత్తల కార్మికవ్యతిరేక చర్య లను కమ్యూనిస్టులు తమ పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని తెలంగాణ ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న పిలుపు నిచ్చారు. నెల్లూరులోని రుద్రరాజు సత్యనారాయణ కళాప్రాంగణంలో బుధవారం సింహపురి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా తెలంగాణను సాధించుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కమ్యూనిస్టులు ఎంతోమంది మరణించారన్నారు. కమ్యూనిస్టులు హింసావాదులు కాదన్నారు. కమ్యూనిస్టుల త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన తెలిపారు.

తెలంగాణపోరాటంలో అసువుల బాసిన వారిపై పాటపాడుతూ అందరిని ఆకట్టుకున్నారు.

న్యూస్ బాక్స్

ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాల కోసం ఓబీ ఎంఎంఎస్ పోర్టల్‌లో ఫిబ్రవరి ఏడులోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి బుధ వారం ఒక ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 8 నుంచి 11 వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. మండలాధికారులు, బ్యాంకు అధికారులు క్షేత్ర పరిశీలన చేసి ఫిబ్రవరి 12 నుంచి 14వరకు లబ్ధిదారుల ఎంపిక చేపడతారని తెలిపారు. ఎంపిక జాబితాను వారు జిల్లా అధికారులకు ఫిబ్రవరి 15 నుంచి 20లోగా సమర్పిస్తారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 21 నుంచి 23లోగా జిల్లా కలెక్టర్ అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. అర్హత కలిగిన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు.

ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యుల వివాదం



చినక్రాక సొసైటీలో ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

జలదంకి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో చేపల పెంపకం విషయమై సొసైటీ సభ్యుల మధ్య బుధవారం రిజర్వాయరు కట్టపై వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో ఇరువర్గాలు ఒకరినొకరు నెట్టుకుంటూ సవాళ్లు విసురుకున్నారు. గత వైసీపీ పాలనలో చేపలు పెంచిన వారే టీడీపీ ప్రభుత్వంలో చేపలు పెంచుకోవాలని సభ్యులు నిర్ణయించడంతో తూముల వద్ద వలలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ నిర్ణయాన్ని కొందరు సభ్యులు దీన్ని వ్యతిరేకిస్తూ వలలు తీసేస్తుండడంతో ఈ వివాదం కాస్తా ముదిరి టెన్షన్ వాతావరణం నెలకొంది. కలిగిరి సీఐ వెంకట నారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా సంఘటనా స్థలానికి వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు.

జిల్లాలో రైల్వే ఎస్పీ

నెల్లూరు(క్రైం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు డివిజన్ రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా కుటుంబసభ్యులతో మంగళవారం సాయంత్రం నెల్లూరుకి వచ్చారు. ఆయన కృష్ణపట్నం పోర్టును సందర్శించి నగరంలోని పోలీసు అతిథి గృహంలో బస చేశారు. అనంతరం ఆయన బుధవారం రాత్రి నెల్లూరు రైల్వే డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని రికార్డులు పరిశీలించారు. నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో రైల్వే సీఐ భుజంగరావుపై వచ్చిన ఆరోపణలపై ఆరాతీసినట్లు సమాచారం.

జైలు సూపరింటెండెంట్‌పై విచారణ

నెల్లూరు(క్రైం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాజారావుపై వచ్చిన ఆరోపణలపై బుధవారం జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ ఎం వరప్రసాద్ విచారణ జరిపారు. నగరంలోని మూలాపేటలోని ఏపీ స్టార్స్‌లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రహస్య విచారణ చేశారు. కొద్దిరోజులుగా ఖైదీల బంధువులు, రిమాండ్ నుంచి బయటకు వచ్చిన వ్యక్తులు సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్నట్లు ఉన్న ఆడియో రికార్డులు వైరల్ కావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో జైలు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. డీఐజీ బుధవారం ఆడియోలో వాయిస్ ఉన్న వ్యక్తులను పిలిచి విచారణ జరిపారు. స్టేట్‌మెంట్లను రికార్డు చేసి వారి వద్ద ఉన్న ఆడియోలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం జైలు సూపరింటెండెంట్ రాజారావు నుంచి వివరణ తీసుకున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	123
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7856
వెండి కిలో ధర	రూ. 93,000
వెండి ఒక గ్రాము	రూ.96.00

గ్రావెల్ తవ్వకాలపై చర్యలేవి?

- తవ్వకందారులకు వైసీపీ నేతల అండదండలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా పట్టించుకోని వైనం
- విజిలెన్స్ విచారణ చేయాలంటున్న ప్రజలు

కావలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం లోని సాగునీటి చెరువులతో పాటు కావలి మండలం రుద్రకోటలో ప్రభుత్వ తిప్ప, బోగోలు మండలంలో జాతీయ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. అలాగే దగదర్తి మండలంలో ఎయిర్‌పోర్టు భూములు, జగనన్న లేఅవుట్‌లోని పెద్ద తిప్ప ఇందులో ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటినా అక్రమ గ్రావెల్ తరలింపు దారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించలేక పోతున్నారని చెబుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్ విచారణ చేపట్టగా ఈ నియోజకవర్గంలో ఎందుకు ఆ పని చేయలేకపోతున్నారని, ఇందులో ఏమైనా మతలబు ఉందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



రుద్రకోట ప్రభుత్వ స్థలంలోని కొండను తొలిచి తరలించిన గ్రావెల్

జాతీయ రహదారి.. ప్రమాదంగా మారి..!

నకిరేకల్-ఏర్పేడు జాతీయ రహదారి కొన్నిచోట్ల నెర్రెలు బారింది. మరికొన్నిచోట్ల కుంగిపోయి గుంతలమయంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారి అధ్వానంగా మారడంతో వాహనాలు అదుపుతప్పి పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రధానంగా దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లో రహదారి మొత్తం కుంగి నెర్రెలు బారింది. పలుచోట్ల గుంతలు కూడా పడ్డాయి. రహదారి వెంట ఏర్పాటు చేసిన వంతెనల దగ్గర రోడ్డు, వంతెన శ్లాబు కుంగడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జాతీయ రహదారికి మరమ్మతులు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి




కుష్ఠు నివారణలో పురోగతి

- వ్యాధిని అరికట్టడంలో ఆశించిన ఫలితాలు
- వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక చికిత్స
- వైకల్యం రాకుండా ముందస్తు చర్యలు
- అయినా నేటికీ వివక్ష
- నేడు ప్రపంచ కుష్ఠు నివారణ దినం

నెల్లూరు (వైద్యం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠువ్యాధి నివారణలో వైద్యఆరోగ్యశాఖ ఆశించిన ప్రగతి సాధిస్తోంది. వ్యాధిగ్రస్థులకు వైద్యచికిత్సలతోపాటు వారి సంక్షేమాన్ని కూడా అధికారులు చేపడుతున్నారు. అయితే కొంతమంది వ్యాధిగ్రస్థులు వ్యాధిపై నిర్లక్ష్యం వహించటంతో వికలాంగత్వానికి గురవుతున్నారు. ఆఖరి దశలో వైద్యులను ఆశ్రయిస్తూ శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వస్తున్నది. ఇదిలా ఉంటే జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల పట్ల సమాజంలో నేటికీ వివక్ష ఉండటంతో బాధితులు సమాజానికి దూరంగా ఉండాల్సి వస్తున్నది. ఎక్కువ మంది వ్యాధిగ్రస్థులలో ఎస్టీ, ఎస్సీలు ఉండటంతో ఆయా కాలనీలపై వైద్యశాఖ దృష్టి సారించింది. ఈ వ్యాధికి కారణమైన సూక్ష్మజీవిని కనుగొన్న హెన్సన్ జ్ఞాపకార్థంగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 30న (నేడు) కుష్ఠువ్యాధి నివారణ దినం జరుపుకుంటున్నారు.

● నియంత్రణకు చర్యలు

జిల్లాలో కుష్ఠువ్యాధి నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ తగిన చర్యలు తీసుకుంటున్నది. జిల్లాలో 1989లో 65,587 మంది వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. గత ఏడాదే మల్టీడెరపీ ట్రీట్‌మెంట్ అమలు చేశారు. వ్యాధిని నివారణ మందులు అందుబాటులోకి రావడంతో వ్యాధిగ్రస్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది.



ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1107 వ్యాధి గ్రస్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే అనుక మంది వ్యాధిగ్రస్థులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తున్నది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రతి పీహెచ్‌సీలో వ్యాధి నివారణ మందులను అందుబాటులో ఉంచింది.

● ప్రత్యేక కాలనీల ఏర్పాటు

జిల్లాలో వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక కాలనీలను అధికారులు ఏర్పాటు చేశారు. 1993లో వీరికి ఓ కాలనీ ఏర్పాటు చేసేందుకు అప్పటి కలెక్టర్ సాంబశివరావు ప్రత్యేక కృషి చేశారు. ఆమంచర్లలో ఓ కాలనీని ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్థుల జీవన భృతికి 70 ఎకరాలను కేటాయించారు. ఆ ప్రాంతంలో ఓ ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్థులకు వైద్యం అందచేస్తున్నారు.

● పింఛన్ల పంపిణీ

జిల్లావ్యాప్తంగా వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం వికలాంగత్వ పింఛన్లు అందచేస్తున్నది. ప్రస్తుతం 490 మంది వ్యాధి తీవ్రత ఉన్నవారికి ఈ పింఛన్లు అందిస్తున్నారు. వ్యాధివల్ల వికలాంగత్వం వచ్చిన వారిని దివ్యాంగులుగా గుర్తించి ప్రభుత్వం రూ. 6వేలు వంతున పింఛన్ అందిస్తున్నది. వీరికి ఏఏవై రేషన్ కార్డులు కూడా అందచేశారు.

ప్రజలకు అవగాహన



కుష్ఠు వ్యాధి గ్రస్థులను గుర్తించి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నాం. వ్యాధిగ్రస్థుల్లో వికలాంగత్వం రాకుండా శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నాం. వ్యాధిగ్రస్థులు ఇంకా ఎంతమంది ఉన్నారో ఎప్పటి కప్పుడు సర్వేలు కూడా చేపడుతున్నాం. గుర్తించిన వారికి వైద్యచికిత్సలు అందిస్తున్నాం. వ్యాధిగ్రస్థుల పట్ల వివక్షను పోగొట్టేందుకు ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా కుష్ఠు నివారణాధికారి

రూ.8 లక్షల కోట్లు దోపిడీ చేసిన జగన్

- వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (వైద్యం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో వివిధ మార్గాల ద్వారా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ. 8 లక్షల కోట్ల దోపిడీకి పాల్పడ్డారని వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ విమర్శించారు. బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ. 10 లక్షల కోట్ల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జగన్ రాష్ట్ర ఆర్థిక స్థితిని దివాళా తీయించడం వల్లే ఇచ్చిన హామీలు ఆలస్యమవుతున్నా యన్నారు. జగన్ విలాసాలకు రూ. 19,871 కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని చెప్పారు. సర్వేరాళ్లపై తన బొమ్మ వేయించుకున్న ఏకైక వ్యక్తి ఆయనేనని, ఇందుకు రూ. 700 కోట్లు ఖర్చు చేశారని అజీజ్ వెల్లడించారు. జగన్ పాలన వల్ల దెబ్బతిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేది చంద్రబాబేనని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా చంద్రబాబును అందరూ ఆదరిస్తున్నారని, త్వరలో మన బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

విద్యార్థిని బలవన్మరణం



దుర్గ (ఫైల్)

ఇందుకూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఓ విద్యార్థిని తన ఇంట్లోని బాత్‌రూములో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. జగదేవిపేటకు చెందిన ఆనంతోచి వేణుగోపాలాచారి, లావణ్యల కుమార్తె దుర్గ(14) ఆదెమ్మ సత్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఏమైందో ఏమోగానీ మంగళవారం రాత్రి తన ఇంట్లో స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో తల్లి లావణ్య కుమార్తెను పిలవగా పలకకపోవడంతో బాత్‌రూం తలుపు తెరవగా చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. హుటాహుటిన స్థానిక ఓ ప్రథమ చికిత్సాలయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇందుకూరుపేట సీఐ కేసు. దాకర్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించిన కారణం పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.

31లోగా టీచర్ల సమాచారం అందించాలి

నెల్లూరు (విద్య), జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో తమ పూర్తి సమాచారాన్ని పొందు పరచాలని డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాపరమైన, వృత్తిపరమైన సమాచారాన్ని cse.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ నెల 31వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఈ వివరాలు పొందుపరచాలని, ఎడిట్ ఆప్షన్ కూడా అందుబాటులో ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కర్రల సంచి కత్తిరించి పర్సు చోరీ

నెల్లూరు(క్రైం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుమార్తె కోసం షాపింగ్‌మాల్ వద్ద ఎదురు చూస్తున్న తల్లి చేతిలో ఉన్న కర్రల సంచి కింద కోసి పర్సును దోచుకెళ్లారు.ఈ ఘటనపై నగరంలోని చిన్నబజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, కోట మండలం కొత్తపట్నంలో పోలయ్య, లక్ష్మమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. మూడో కుమార్తె వివాహం కోసం ఈనెల 11న లక్ష్మమ్మ వస్త్రాలు కొనేందుకు నగరానికి వచ్చారు. నగరంలోని వీఆర్సీ సెంటర్‌లోని ఓ షాపింగ్ మాల్ బయట కుమార్తె కోసం లక్ష్మమ్మ కర్రల సంచి పెట్టుకొని ఎదురు చూస్తున్నది. గుర్తుతెలియని దుండగలు కర్రల సంచి కోసి అందులోని పర్సును దోచుకెళ్లారు. కుమార్తె వచ్చాక సంచి కోసి ఉండటాన్ని గమనించిన లక్ష్మమ్మ అందులోని పర్సు లేకపోవడంతో భోరున విలపించింది. పర్సులో రూ.40 వేల నగదు ఉందని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



పోక్సో కేసులో నిందితుల వివరాలు తెలియచేస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాలను నగర డీఎస్పీ సింధుప్రియ బుధవారం నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. తిరుపతి జిల్లాకి చెందిన ఓ బాలిక నగరంలోని సంతపేట పరిధిలోని బాలికల ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతూ దగ్గర్లోని హాస్టల్‌లో ఉంటోంది. పాఠశాలకు వెళ్లిన ఆ బాలిక ఈనెల 25న సాయంత్రం తిరిగి హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు 26న నెల్లూరుకు చేరుకొని సంతపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జీ దశరథ రామారావు పర్యవేక్షణలో ఎస్ఐ జీ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాలిక ఆత్మకూరు బస్టాండు వద్ద కనిపించడంతో పోలీసులు రక్షించారు. ఏమి జరిగిందని బాలికను ఆరా తీయగా ఇద్దరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారని తెలిపింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఆ బాలిక ఇంటి నుంచి పాఠశాలకు వచ్చి వెళ్లే క్రమంలో సైదాపురం మండలం గిద్దలూరుకి చెందిన నిరంజన్ నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో పరిచయం అయ్యాడు. అతను బాలికతో చనువుగా ఉండేవాడు. ఈ నెల 25న సాయంత్రం నిరంజన్ ఆ బాలికను తీసుకుని సౌత్‌రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అతను పరారయ్యాడు.

అదే సమయంలో నగరంలోని బీవీనగర్‌కి చెందిన పృథ్వీ ఉరఫ్ రాజేష్ ఆ బాలికను హాస్టల్ వద్ద వదిలి పెడతానని చెప్పి అదే రోజు రాత్రి బీవీ నగర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారం చేశాడు. 26న రాత్రి ఆత్మకూరు బస్టాండు వద్ద వదిలి పెట్టి, ఇక్కడే ఉండాలని కొద్ది సేపటి తరువాత వచ్చి తీసుకెళతానని రాజేష్ చెప్పి వెళ్లాడు. బాలిక బస్టాండులో ఏడుస్తూ కన్పించడాన్ని గమనించిన పోలీసులు ఓదార్చి సంతపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఏమి జరిగిందని ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించగా ఇద్దరు వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించారని చెప్పడంతో మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా బుధవారం మొదటి నిందితుడు దండే నిరంజన్‌ను సుబేదారుపేట వద్ద, రెండో నిందితుడు రాజేష్‌ను బీవీనగర్‌లోని అతని ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఎంతో చాకచక్యంగా ఛేదించి, నిందితులను అరెస్టు చేసిన నగర డీఎస్పీ సింధుప్రియ, సంతపేట ఇన్‌స్పెక్టర్ జీ దశరథరామారావు, ఎస్ఐ జీ బాలకృష్ణ, సిబ్బందిని ఎస్పీ జీ కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరురూరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి) : ఈ-ఆటో మొబైల్ షోరూం ఏర్పాటు చేయిస్తానని రూ. 22 లక్షలు తీసుకుని మోసం చేసిన సంఘటనపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అనకాపల్లికి చెందిన సత్యనారాయణ నెల్లూరులో ఎరీషా ఈ-ఆటో మొబైల్ షోరూం పెట్టిస్తా నని రూరల్ మండలం గుడిపల్లి పాడుకి చెందిన పందిళ్లపల్లి శ్రీనివా సులు వద్ద నగదు తీసుకున్నాడు. ఎంతకీ ఇవ్వకపోవడంతో మోసం చేశాడని గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బీజేపీ అండతోనే బయట తిరుగుతున్న జగన్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత చింతా మోహన్

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ అండతోనే వైసీపీ అధినేత జగన్ బెయిల్‌పై తిరుగుతున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యవహారంలో తానేమి చేయలేకపోతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నిస్సహాయంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ప్రయోజనం కాపాడటంలో ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు విఫలమయ్యాయని విమర్శించారు. జగన్ ఇక తిరిగి ముఖ్యమంత్రి కాబోడని స్పష్టం చేశారు. ప్రజల్లో మార్పు వస్తోందని, దేశానికి ప్రత్యామ్నాయ ప్రభుత్వం అందించేది కాంగ్రెస్ పార్టీ అని ప్రజలు నమ్ముతున్నట్లు చింతా తెలిపారు. విశాఖ ఉక్కుకు గత వైభవం రావాలంటే రూ.11వేల కోట్ల సాయం అందించాలని, దానిని ప్రైవేటీకరణ చేయమని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్‌గా ముత్తుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల

ముత్తుకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఈదూరు ఈశ్వరమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చనున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ సభ్యులు బుధవారం పాఠశాలను సందర్శించారు. ఎంఈవోతో కలిసి పాఠశాల ఆవరణంలో ఉన్న ఖాళీ స్థలాలు, తరగతి గదులు, నిర్మాణంలో ఉన్న గదులు, ప్లే గ్రౌండ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ముత్తుకూరు హైస్కూల్‌తో పాటు జిల్లాలో మరో రెండు హైస్కూళ్లను మోడల్ స్కూల్స్‌గా మార్చనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ దేవి, మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ స్కూల్‌లో పర్యటించి వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేక కమిటీ సభ్యులు

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



బుచ్చి శాంతినగర్‌లోని ఓ లేఅవుట్‌లో ఉన్న షెడ్డులో ఉరి వేసుకున్న ముజాహిద్

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): తల్లిదండ్రులు మందలించారని మనస్థాపంతో ఎస్‌కే.ముజాహిద్ (20) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని శాంతినగర్‌లోని ఓ లేఔట్‌లోని షెడ్డులో బుధవారం ఉదయం జరిగింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంతోష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు... సంగం మండలం జెండా దిబ్బకు చెందిన ముజాహిద్ ఉద్యోగం కోసం హైదరాబాదుకు వెళ్లి మరుసటి రోజే ఇంటికి తిరిగి వచ్చేశాడు. దీంతో తల్లి ఉద్యోగం చూసుకోకుంటే ఎలా అని మందలించడంతో మనస్థాపం చెంది ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులురెడి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదు

● ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల విషయంలో ఎట్టిపరిస్థితుల్లో రాజీపడేది లేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని 43 ప్రాంతాల్లో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యాపార కేంద్రాలు, ముఖ్యమైన మార్గాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయించామన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే దాతలను సత్కరించారు. కార్యక్రమంలో సీఐలు వెంకటేశ్వరరావు, మంగారావు, పట్టణ ఎస్ఐ సాంబశివరావు, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య పాల్గొన్నారు.


సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

పెట్రోలు బంకు ఏర్పాటు అనుమతిని రద్దు చేయాలి

● రెవెన్యూ మంత్రికి మాజీ ఎమ్మెల్యే దివి శివరాం వినతి

కందుకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటుకు ఇచ్చిన అనుమతిని తక్షణం రద్దుచేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే దివి శివరాం బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిశారు. వెలుగు, ఐసీడీఎస్ కార్యాలయాలు, మహిళాబ్యాంకు ఉన్న ప్రాంతంలో వందేళ్లనాటి భారీవృక్షాలు ఉన్నాయని, అలాంటి ప్రదేశంలో అద్దెకు ప్రభుత్వస్థలాన్ని ఇవ్వటం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించారని శివరాం తెలిపారు. అలాగే చుక్కల భూముల సమస్య, రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల రైతులు ఎదుర్కొంటున్న భూసేకరణ సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆయన వెంట పొడపాటి శ్రీను, తోకల వెంకటేశ్వర్లు ఉన్నారు.


మంత్రి సత్యప్రసాద్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి

● ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషిచేద్దామని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అవినీతి, అక్రమాలకు తావులేకుండా గ్రామసచివాలయాలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. ముందుగా వ్యవసాయశాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, ఎం శ్రీనివాసరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధునికి గాయాలైన సంఘటన స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లోని నాలుగు కాళ్ల మండపం వద్ద బుధవారం జరిగింది. మండలంలోని గానుగపెంటపల్లి గ్రామానికి చెందిన జీ రామిరెడ్డి అనే వృద్ధుడు పని నిమిత్తం బస్టాండ్ నుంచి మెయిన్‌బజార్‌కు వెళుతుండగా ఆర్టీసీ డిపో నుంచి బస్టాండ్‌కు వస్తున్న బస్సు ప్రమాదవశాత్తు అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు ఆటోలో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పాఠశాలల్లో వసతుల పరిశీలన

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో బుధవారం సీఆర్‌డీఏ డీఆర్పీ జీ కల్యాణ్ వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, దళితవాడ ప్రాథమిక, మండలంలోని జీ.చెరువుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి మౌలిక వసతులు, క్రీడా మైదానాలు, మరుగుదొడ్లు, నాడు-నేడు పథకం కింద జరిగిన పనులు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీతో గ్రామసభ నిర్వహించి పాఠశాలల స్థితిగతులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహ, విశ్రాంత హెచ్‌ఎం కలీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ డీఆర్పీ కల్యాణ్

రోగి మృతిపై బంధువుల ఆందోళన

కావలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం స్థానిక ఏరియా వైద్యశాలలో చేరింది బోగోలు మండలం జువ్వలదిన్నె కాటంగారి తిరుపతమ్మ (56). ఆమెను పరిశీలించిన వైద్యులు ఆమె పరిస్థితి అనుకూలంగా లేకపోవటంతో నెల్లూరుకు తీసుకెళ్లమని చెప్పారు. మరుసటి రోజు తీసుకెళతామని వారి బంధువుల చెప్పగా బుధవారం ఉదయానికి ఆమె పరిస్థితి విషమించటంతో మృతిచెందింది. వైద్యులు సక్రమంగా వైద్యసేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకే మృతి చెందినట్లు మృతురాలి భర్త మస్తానయ్య, కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. రోగి పరిస్థితిని వారికి వైద్యులు విపులంగా వివరించి తమ నిర్లక్ష్యం ఏమీలేదని వారికి నచ్చ చెప్పటంతో మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లటంతో సమస్య సద్దుమణిగింది.

ప్లాస్టిక్, నిల్వ పదార్థాల వాడకంతో కేన్సర్

బిట్రగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, నిల్వ ఉంచిన ఆహారపదార్థాల తీసుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని క్యాన్సర్ వైద్య నిపుణులు ఆళ్ల దీప్తి తెలిపారు. బోగోలు రాజాశీధిలోని షిరిడీసాయి మందిర ఆవరణంలో ఒంగోలు హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. బోగోలు ఇతర పరిసర ప్రాంతాల నుంచి 120 మందికి పాల్గొనగా వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో 16 మందికి క్యాన్సర్ నిర్ధారణ, 20మంది నుంచి స్క్రీనింగ్ టెస్టింగ్‌కు రక్త నమూనాలు సేకరించినట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్ జీ.వాసుబాబు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు కొర్రా చంద్రశేఖర్ ఆనందసాగర్, ఆర్ఎంపీ రఫీ, వాకర్ గౌరవాధ్యక్షులు ఎన్ఎస్ యాదవ్, రైల్వే పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షులు గోవిందరాజులు, సాయిట్రస్ట్ సభ్యులు ఐశ్వర్య, అవార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు బాలశైలజ ఉన్నారు.

సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకోండి

వింజమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథ్‌రెడ్డి కోరారు. మండలంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఆయన మాట్లాడుతూ మండలానికి 43 యూనిట్లు మంజూరయ్యాయని, చాకలికొండ మడగల, వింజమూరు బ్యాంకులకు అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే నందమూరి బాలకృష్ణకు పద్మవిభూషణ్ అవార్డుపై హర్షం వ్యక్తం చేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో విశిష్ట సేవలందించినందుకు గానుగణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిని బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు కానిస్టేబుళ్లు అశోక్, ప్రశాంత్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

● ప్రమాదాల బారిన వాహనదారులు

ఉదయగిరి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఊరురా నిర్మించిన స్పీడ్‌బ్రేకర్లు వాహనదారుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. గ్రామాలలో దుకాణాలు, నివాసాల సమీపంలో వాటి యాజమానులు నిబంధనలను పాటించకుండా సిమెంట్‌తో ఎత్తుగా కట్టగా పోస్తున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడికి చేరుకున్న వాహనాలు అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వెంగళరావునగర్, గంగిరెడ్డిపల్లిపల్లి, వరికుంటపాడు మండలంలో తూర్పుబోయమడగల, వరికుంటపాడు, జీ.కొండారెడ్డిపల్లి, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఏటవాలుగా నిర్మించక పోగా సూచిక రంగులు, బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దూరంగా వాటిని గుర్తించలేని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంటికి కనిపించని విధంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయడంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


వెంగళరావునగర్ వద్ద నిర్మించిన స్పీడ్ బ్రేకర్

క్షతగాత్రులను వైద్యశాలలో చేర్పిస్తే ప్రోత్సాహకం

సంగం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయంలో ఉన్న రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే వైద్యశాలలో చేర్పిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకం అందచేస్తుందని తహసీల్దారు సోమ్లా నాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాలలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బాధితులకు సహాయం చేసే చట్టంపై అవగాహన కల్పించారు. ప్రాణం ఎంతో విలువైనది, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను గంటలోపు వైద్యశాలకు చేర్చి వైద్యం అందేటట్లు చేస్తే వారి ప్రాణం కాపాడవచ్చన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు, స్థానిక ఎస్ఐ రాజేష్, వైద్యాధికారి డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

●కావలి టౌన్: సింహపురి మునునూరు టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో బుధవారం మునునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం లావణ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రహదారి ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, ఆపరేషన్ హెడ్ ఆనంద్, టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, సేఫ్టీ ఆఫీసర్ పృథ్వీ పాల్గొన్నారు.


సంగం : వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

పంట నమోదు చేసుకోకపోతే పరిహారం రాదు

కలువాయి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి సాగు చేసిన రైతులంతా తప్పని సరిగా పంట నమోదు (ఈ-క్రాప్) చేయించుకోవాలని, లేకుంటే పంట నష్టపోయినప్పుడు పరిహారం రాదని మండల వ్యవసాయాధికారి వీ ప్రతాప్ తెలిపారు. బుధవారం వెంకటరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ఇప్పటికి మండలంలో 94శాతం పంట నమోదు అయిందని, మిగిలిన వారు త్వరగా నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వరిపైరులో ఎలుకల నివారణకు రాయితీపై మందు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ, హార్టికల్చర్ అసిస్టెంట్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

●వలేటివారిపాలెం: రబీ సీజన్‌లో సాగు చేసిన అన్ని పంటలకు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. నేకునాంపురం, శింగమనేనిపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనగపంటను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు అసిస్టెంట్ వినయ్, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభు, రైతులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ సూచించారు. బుధవారం మండలంలోని నేలటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. పంటలకు సోకిన పలు తెగుళ్లను గుర్తించి వాటి నివారణ చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ఆర్గనైజర్ నాగలక్ష్మి, సిబ్బంది సురేష్, వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కలువాయి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఆలయ ప్రహరీ నిర్మాణం


ప్రహరీ నిర్మిస్తున్న గ్రామస్థులు

బిట్రగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి గ్రామదేవత పోలేరమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడారు. ఆలయ ఉత్తరం కడనూతల చెరువు కలుజు నీరు పారి ఆ ప్రాంతం కోతకు గురికాకుండా ఈ చర్యలు చేపట్టామన్నారు.

వాలీబాల్ నెట్ బహూకరణ

వింజమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ హైస్కూల్‌కు బుధవారం నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ వాగల శ్రీహరి వాలీబాల్ నెట్‌ను బహూకరించారు. విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో హెడ్మాస్టర్ కె మాలకొండయ్య, పీఈటీలు సుమలత, అంజయ్య, తిరుపాలు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గం ఎంపిక

ఉదయగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం మండల బీజేపీ అధ్యక్షుడు మోటపోతుల చెన్నయ్య ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల గౌరవాధ్యక్షుడిగా చల్లా సుబ్బరత్నం, ఉపాధ్యక్షుడిగా బీ కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజానాయబ్ రసూల్, కార్యదర్శిగా ఎన్.రాంనరేష్, కోశాధికారిగా శానంపూడి నరసయ్య, ట్రెజరర్‌గా ఎం బాలిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలిగా సునోమియా, మహిళా ప్రధాన కార్యదర్శిగా ఆవుల సౌందర్యతోపాటు మరో ఎనిమిది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆవుల రోశయ్య యాదవ్, నెల్లూరు వెంకటస్వామినాయుడు, సయ్యద్ షాజహాన్, దుగ్గయ్య పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

వలేటివారిపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు పోలినేనిపాలెం యూపీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థిని బొగ్గవరపు నాగవెంకట దివ్యశ్రీకి ఉపాధ్యాయులు మాదవరావు, సుధాకర్‌రావు, మూర్తి, గిరిబాబు, రమేష్‌లు రూ.6.వేలు విలువ కలిగిన ట్రైసైకిల్‌ను బుధవారం పంపిణీ చేశారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

లింగసముద్రం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకోస్తామని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన పెంట్రాల, పెద పవని, ముత్యాలపాడు చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య, పంచాయతీ కార్యదర్శులు మాధవరావు, షేక్ రసూల్ తదితరులు ఉన్నారు.

కేసరిగుంట కాలనీలో కార్డెన్ సెర్చ్

● పత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లు

కందుకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కేసరిగుంట కాలనీలో కందుకూరు సబ్ డివిజన్ పోలీసులు బుధవారం వేకువజామున కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. కాలనీలోని ఇంటింటినీ తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 37ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకటేశ్వరరావు, మంగారావు, సబ్ డివిజన్‌లోని ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్ల పత్రాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేపడతామన్నారు. అసాంఘికశక్తులు తిష్టవేయకుండా చూడటమే తనిఖీల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

నేడు హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

కావలి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు గురువారం మహిళలతో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్టీవో వై సుధాకర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. మెటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సుందరరావు పర్యవేక్షణలో జరిగే కార్యక్రమంలో మహిళలు, కళాశాల విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో విద్యారమ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు సంబంధించి 28 రికార్డులను ఆమె పరిశీలించారు. రికార్డుల నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఖాజానవాజ్‌కు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, కార్యాలయ ఏవో సీహెచ్ పద్మజ, జూనియర్ అసిస్టెంట్ సమద్, డీఈవో ఇమ్రాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

మొక్కుబడిగా సీతారామపురం మండల సమావేశం

సీతారామపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన బుధవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. 14మంది సర్పంచులకు గాను ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండల వ్యాప్తంగా నీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యచరణ తయారు చేయాలన్నారు. అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఎంపీడీవో భాస్కర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చెరుకుపల్లి రమణరెడ్డి, వైస్ ఎంపీపీ శారమ్మ, ఎంపిటిసి పిసి అల్లూరు రాజు, ఎంఈవో మస్తాన్‌వలి, ఈవోపీఆర్డీ భార్గవి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిల, కొత్తపల్లిలో పశువైద్య శిబిరం

అనంతసాగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, కొత్త పల్లి పంచాయతీ కాకురువారిపల్లిలో బుధవారం ఏడీ గురుజయంతి పర్యవేక్షణలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా మూగజీవాలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతసాగరం, రేవూరు పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

●చేజర్ల : మండలంలోని చిత్తలూరు గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుఆరోగ్య శిబిరం నిర్వహించి పాడిపశువులకు, దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. అనంతరం పలు రకాల దాణాలను రైతులకు అందజేశారు. ఈకార్యక్రమంలో చేజర్ల పశువైద్యాధికారి డా. పి రాజేష్, స్థానిక నాయకులు మోదేపల్లి పెంచలనాయుడు, సిబ్బంది శ్రీకాంత్, సంజీదా, రియాజ్, సల్మాన్, స్థానిక పాడి రైతులు పాల్గొన్నారు.

●కొండాపురం :సాయిపేట పంచాయతీ మక్కెనవారి పాలెంలో పశుసంవర్ధక శాఖ అధికారులు బుధవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వ రరావు దూడలు, పశువులకు నట్టల నివారణకు మందులు తాగించారు. కా ర్యక్ర మంలో తాటికొండ అనూష, వైద్యసిబ్బంది శేషాద్రి, విజయ నరసింహ పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం

● రామ్మోహన్, వ్యవసాయాధికారి



మర్రిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పొలం పిలుస్తోంది కార్యక్రమం పేరుతో వారంలో రెండు రోజులు రైతుల పంటలు పరిశీలిస్తున్నామని మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ శనివారం తెలిపారు. అవసరమైన ఎరువులు, పురుగు మందులు వాడేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

? పైరు ఎదుగుదల లేదని రైతులు అంటున్నారు. కారణం ఏమిటి.

! ఇటీవల 28 రోజుల పాటు పంటకు తగినంత సూర్యరశ్మి అందలేదు. అందుకు వాతావరణంలో మార్పులే కారణం.

? రైతులకు యూరియా సమృద్ధిగా దొరుకుతుందా.

! ఆర్బీకేలలో 10మంది రైతులు కలిసి ముందుగా నగదు చెల్లిస్తే అవసరమైన మేరకు వస్తుంది. మర్రిపాడు మండలంలో ఇటీవల 300 టన్నుల యూరియాను తెప్పించాము.

? రైతులకు అవసరమైన పరికరాలను ప్రభుత్వం అందిస్తుందా.

! త్వరలో స్ప్రేయర్లు, నాగళ్లు, పట్టలు వంటివి ప్రభుత్వం అందిస్తుందని ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉంది.

న్యూస్ బాక్స్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఉలవపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3న నెల్లూరు వీఆర్‌సీ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే సీపీఎం మహాసభల వాల్‌పోస్టర్‌ను బుధవారం సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ ఆవిష్కరించారు. కరేడు పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీ, పీటీపీ ఫ్యాక్టరీ వద్ద సీపీఎం కమిటీ సభ్యులు, సానుభూతిపరులతో ప్రచారం నిర్వహించారు. మండలం నుంచి అధికసంఖ్యలో కార్మికులు, కూలీలు, గిరిజనలు పాల్గొనేలా సమీకరిస్తున్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు కత్తి సుజాత, గంజి శ్రీనివాసులు, లోకేష్, రామలక్ష్మమ్మ, అనిల్, జ్ఞానయ్య, సుభాషిని పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల పరిశీలన

కొండాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో ఆదినారాయణ రేణమాల, సత్యవోలు, గానుగపెంట పంచాయతీలలో నిర్మించిన కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ కేంద్రాల్లో కూరగాయలు, పూలమొక్కలు, పండ్లచెట్లను పెంచి పచ్చదనంతో తీర్చిదిద్దుతామన్నారు. ఫిబ్రవరి 15వ తేదీకల్లా మండలంలోని 18చెత్త సంపద తయారీ కేంద్రాల ను వినియోగంలోకి తీసుకొస్తానమన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

కావలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే ట్రాక్‌కు పడమర వైపున ఉన్న ఇందిరమ్మకాలనీ రోడ్డు, రైల్వేట్రాక్ పడమర, రేడియోపార్కు, భవానీ వీధి, తుఫాన్‌నగర్, కొత్త శివాలయం వీధిలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించి ఉన్న కట్టడాలను బుధవారం మున్సిపల్ అధికారులు గుర్తించి ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికాధికారి వివేకానంద ఆధ్వర్యంలో ప్రణాళికా విభాగం సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

కావలి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ భారతీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం జరిగిన అథ్లెటిక్ మీట్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో జూనియర్, డిగ్రీ కళాశాలలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జేబీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ సుబ్రమణ్యం నాయుడు, శామ్యూల్‌రాజ్, ఎస్తేర్‌బ్యూలా పీడీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

13 మంది విద్యార్థుల ఎంపిక

కావలి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫస్ట్‌సోర్స్ కంపెనీవారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 13మంది విద్యార్థులు ఎంపిక య్యారు. కళాశాల కరస్పాండెంట్ రాజ్ కుమార్‌చౌదరి ప్రిన్సిపాల్ ఉమ వీరిని అభినందించారు. 40మంది పాల్గొనగా 13 ఎంపికయ్యారు.

చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన వారికి ఏపీజీబీ మేనేజర్ టీ రాణిబారతి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీ రవి కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వరి, క్యాషియర్ షాకీర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు పని చేయాలి

● ఇకపై సచివాలయాల్లో తరచూ ఆకస్మిక తనిఖీ ● ప్రత్యేక పీజీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక సీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మండలంలోని 14 సచివాలయాల సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా గిరిజనులు, దళితులు రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు లేవని, పింఛన్లు రావడం లేదని వాపోతున్నారన్నారు. గడిచిన 5 ఏళ్లు పేదలకు ఎలాంటి సేవలు అందించారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు 3వేల అర్జీలు వచ్చాయన్నారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి ఫిబ్రవరి 15లోగా దళిత, గిరిజనుల ఆధార్, రేషన్, పింఛన్, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇకపై తరచూ సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేస్తానన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన 299 మంది నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్, సుబ్బయ్య, ఎంపీడీవో జలజాక్షి, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, చేరెడ్డి పద్మనాభరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరించి ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద హెల్ప్‌డెస్క్



టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), జనవరి 29, (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లలో నివాసముంటున్న ప్రజల సమస్యల పరిష్కారం కోసం త్వరలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. బుధవారం వెంకటేశ్వరపురంలోని టిడ్కో సముదాయాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మరిన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు త్వరలో సచివాలయం, ప్రాథమిక వైద్యశాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇళ్లు పొందిన లబ్ధిదారులు త్వరలో తమ ఇళ్లలోకి రావాలన్నారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చిన ఆయన కొత్త విద్యుత్ దీపాలను పరిశీలించి, అవసరమైన చోట్ల ఏర్పాటు చేయాలన్నారు. నిరాశ్రయులకు శిబిరం ఏర్పాటు చేసిన ఆయన వారికి ఉపయోగపడే వస్తువులు అందచేశారు. కాగా ఎస్‌ఎంసీ కార్యాలయంలో వీధి వ్యాపారులకు షాపులు కేటాయింపు కోసం ఏడీసీ నందన్, టీపీఆర్వో బాలకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మరుగుదొడ్లు.. రోగుల గదులకు తాళం.. తాళం!

● ఏఆర్‌టీ సెంటర్‌లో నీటి కొరత ● మూడు నెలలుగా ఆగిన సరఫరా
● ఉపయోగపడని మరుగుదొడ్లు ● తెరుచుకోని అద్దె గదులు ● పిచ్చిచెట్లతో పాముల సంచారం

నెల్లూరు (వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు అవసరమైన వైద్య చికిత్సలు అందించే జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ప్రభుత్వ ఆసుపత్రి పాత భవనంలో ఉన్న ఈ కేంద్రానికి మూడు నెలలుగా నీటి సరఫరా ఆగి పోయింది. ఎప్పుడో వేసిన పైపులైన్లు పాడయ్యాయి. దీనికితోడు భవనం గోడలో రావిచెట్టు పెరిగి నీటి పైపులను చీల్చుకుని ఎదిగింది. దీంతో నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

● రోగుల తాకిడి ఎక్కువే...

ఏఆర్‌టీ సెంటర్‌లో ముగ్గురు వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందిస్తుంటారు. ఈ కేంద్రానికి ప్రతి రోజూ 400 మందికిపైగా హెచ్‌ఐవీ బాధితులు వస్తుంటారు. వారికి వైద్య చికిత్సల తోపాటు రెండు నెలలకు సరిపడా మందులు ఇస్తుంటారు. అయితే ఈ కేంద్రంలో మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితిలో మరుగుదొడ్ల కోసం దూరంగా ఉండే జీజీహెచ్‌కి పరుగులు తీయాల్సి వస్తున్నది. ఇలా ఉంటే ఏఆర్‌టీ సెంటర్ చుట్టుపక్కల పిచ్చి మొక్కలు పెరిగి విషకీటకాలు సంచరిస్తుండటంతో రోగులు భయాందోళన చెందుతున్నారు.

● అద్దె గదులకు తాళం

రోగులకు అత్యవసర వైద్య సేవల కోసం ఏఆర్‌టీ సెంటర్‌కు 8 అద్దె గదులు కేటాయించారు. ఇక్కడ నీటి వసతి లేకపోవటంతో ఆ గదులు కాస్తా మూతపడ్డాయి. దీంతో రోజుకు రూ. 1600 వచ్చే ఆదాయం ఆగిపోయింది. రోగుల కౌన్సెలింగ్ విభాగంలోనూ సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలన్నింటినీ వైద్యాధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.





ఏఆర్‌టీ కేంద్రంలో తాళాలు వేసి ఉన్న రోగుల అద్దె గదులు, మరుగుదొడ్లు



భవనం గోడలో భారీ వృక్షం

త్వరలో నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం

ఏఆర్‌టీ సెంటర్‌లో నీటి సరఫరా పునరుద్ధరణపై ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. అందుకు అనుగుణంగా సమస్యలు పరిష్కరిస్తాం. వైద్యులు సూచించినట్లుగా రోగులకు అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం

- డాక్టర్ నరేంద్ర, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్ ప్రాంతానికి చెందిన వాసు ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకొని మోటర్ బైక్‌పై నెల్లూరుకు వస్తుండగా సర్వేపల్లి సమీపంలో అంజనేయస్వామి విగ్రహం వద్ద మలుపులో వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో బైక్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాసుకు గాయాలయ్యాయి. క్షతగ్రాతుడిని చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఓ ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరురూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26, 28 డివిజన్లలో రూ. 2.60 కోట్లతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయింపు చేస్తున్నట్లు తెలిపారు. తన నియోజకవర్గంలో ఎవరిపై కక్షసాధింపులు, వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ విధానాలు తమ వద్ద పనిరావని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బూడిద సుప్రజ, చెక్కా అహల్య, నాయకులు సునీల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల సంరక్షణకు చర్యలు

విడవలూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాడి పశువుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పశువైద్యులు వాణి తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సూడి పశువులకు గర్భధారణ పరీక్షలు, గర్భకోస వ్యాధులు ఉన్న పశువులను పరీక్షలు చేశారు. పెద్ద పశువుల్లో, లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కోళ్లకి తెగులు రాకుండా వ్యాక్సిన్, గొర్రెలకు సీ పాక్స్ నివారణ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నలూరు పురందర్‌రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు : మండలంలోని పోట్లపూడిలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ బి.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు, పశువులకు చికిత్సలు లేగ దూడలకు, పెద్ద పశువులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి షఫీ, టీడీపీ నాయకులు నాసిన రమేష్, సూరపాక రమేష్, వేటూరి విజయ్, పశువైద్య సిబ్బంది పెంచలయ్య, గోపాల్‌మిత్ర యాసిన్, వజ్రమ్మ పాల్గొన్నారు.

భోజన ప్లేట్ల పంపిణీ

నెల్లూరు(విద్య), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రైవర్స్‌కాలనీ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు హెచ్‌ఎం ఖురేషి కిరణ్‌కుమార్ భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. అతిథిగా హాజరైన ఆర్‌టీపీ అధ్యక్షుడు ఖాజారహంతుల్లా మాట్లాడుతూ విద్యార్థులు భోజన సమయంలో ప్లేట్లు లేక ఇబ్బందులు పడుతుండడంతో పాఠశాల కమిటీ చైర్మన్ సమీన్‌తో మాట్లాడి హెచ్‌ఎం తమ సొంత నిధులతో ప్లేట్లు అందచేశారన్నారు. అనంతరం హెచ్‌ఎంను అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబానా, తదితరులు పాల్గొన్నారు.

'ప్రాక్టికల్స్ ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి'

నెల్లూరు (విద్య), జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రాక్టికల్స్ ఫీజుల పేరుతో రూ.వేలు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్‌ఐవో కార్యాలయం ఎదుట బుధవారం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థుల వద్ద నుంచి ప్రాక్టికల్స్ ఫీజుల పేరుతో యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అనధికారికంగా వసూలు చేసిన ఫీజులను తిరిగి విద్యార్థులకు చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. అలాగే సమయానికి మించి తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యాసంవత్సరం ముగియక ముందే అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల పాఠశాలలు, ఇళ్ల చుట్టూ కార్పొరేట్ కళాశాలలు ప్రదక్షిణలు చేస్తున్నాయన్నారు. అనంతరం ఆర్‌ఐవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నేతలు పవన్‌కిషోర్, శివం, శరణ్, సుధీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ) : వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు, తెలుగు గంగ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులతో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీ, శివాజీనగర్, ఎన్‌సీసీ నగర్, ఎన్‌టీటీ కాలనీ, డైకస్‌రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

భక్తుల నిలువ దోపిడీ

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేమాలశెట్టి బావి వద్ద తై అమావాస్య సందర్భంగా బుధవారం భక్తులు దోపిడీకి గురయ్యారు. వైద్య వీర రాఘవస్వామి దర్శనం చేసుకునేందుకు భక్తులకు ఉచిత దర్శనం కల్పించలేదు. భక్తుల నుంచి రూ.20, రూ.50, రూ.100 చొప్పున నగదు వసూలు చేశారు. ఈ విషయమై జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ కే జనార్దన్‌రెడ్డిని వివరణ కోరగా, ఏ ఆలయంలోనైనా భక్తులకు ఉచిత దర్శనం కల్పించాలని తెలిపారు. వేమాలశెట్టి బావి సత్రం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉందని వివరించారు.

కామాక్షితాయి సేవలో ఏఎస్పీ సౌజన్య

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయాన్ని బుధవారం అదనపు ఎస్పీ సౌజన్య దంపతులు సందర్శించి మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు వారిని స్వాగతించారు. అనంతరం గోత్రనామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించి అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.



కామాక్షితాయిని దర్శించుకుంటున్న ఏఎస్పీ సౌజన్య

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి : నగర డీఎస్పీ


నెల్లూరు(క్రైం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర డీఎస్పీ సింధు ప్రియ ఆదేశించారు. నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నగర డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ క్రైం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతూ నేరాలను కట్టడి చేయాలన్నారు. పెండింగ్ కేసుల ఛేదనపై దృష్టి సారించాలని, నగర పరిధిలో సీసీ కెమెరాల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు, మహిళల రక్షణపై ప్రత్యేక దృషి సారించాలని పేర్కొన్నారు. రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, దశరథరామా రావు, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర డీఎస్పీ సింధుప్రియ

పుస్తకాలు సాహిత్య విలువలను పెంపొందిస్తాయి..

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష ఆదరణ కోల్పోతున్న తరుణంలో, పుస్త కాలు భాషను, సాహిత్య విలువలను పెంపొంది స్తాయని మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధ వారం రాత్రి వీఆర్సీ మైదానంలో సింహపురి పుస్తక మహోత్సవం సందర్భంగా జరిగిన జనకవనం అలరించింది. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది కవులు, రచయితలు పాల్గొని తమ కవితలను వివరించారు. ముఖ్యఅతిథిగా విశపు పాల్గొన్నారు. సింహపురి పుస్తక మహోత్సవం నిర్వాహకులు కే లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ పుస్తక మహోత్సవం ఫిబ్రవరి 3 వరకు ఉంటుందన్నారు. పుస్తక ప్రియులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈతకోట సుబ్బారావు, చలంచర్ల భాస్కర్ రెడ్డి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠకులు

దోమల నివారణకు ఫాగింగ్

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపాళెం, జొన్నవాడ గ్రామాలలో దోమల నివారణకు బుధవారం ఫాగింగ్ కార్యక్రమం చేపట్టినట్లు సెక్రటరీ కావేరి తెలిపారు.

రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై కృతజ్ఞతలు

నెల్లూరు(సాంస్కృతికం) జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): కన్యకాపరమేశ్వరి అగ్నిప్రవేశ మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు జీవో జారీ చేశారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి మేగు షణ్ముఖరావు, జిల్లా అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్ తెలిపారు. బుధవారం నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి మండలంలోనూ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు ఈనెల 31న కన్యకాపరమేశ్వరి అగ్నిప్రవేశ మహోత్సవం జరపాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆరోజు ఉదయం 6గంటలకు 102 గోత్రికులు పెన్నానదికి వెళ్లి గంగాదేవికి పూజ చేసి, 102 కలిశాలతో నదీ జలాలు తీసుకువచ్చి అభిషేకం చేస్తారని తెలిపారు. ఉదయం 8 నుంచి గణపతిపూజ, స్వస్తి వాచకం, సకల దేవతా అవాహనం, లక్ష్మీగణపతి, లలితా సహస్ర నామార్చన, నవగ్రహ, రుద్ర, కన్యకాపరమేశ్వరి, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, కలిశ కుంభ సంప్రోక్షణ జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 4గంటలకు కన్యపూజ, 6.30గంటలకు అగ్ని గుండ ప్రవేశం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి బాధ్యులు చిరంజీవి, ఒమ్మిన జనార్దన్‌రావు, దర్శి హరికృష్ణ, బ్రహ్మంగుప్తా, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం తదితరులు

ఉత్తమ సేవ పురస్కార గ్రహీతకు సన్మానం

పొదలకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న మండల ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌ను బుధవారం కార్యాలయ ఉద్యోగులు, సన్నిహితులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కండే పవన్, ఉడతా మురళీకృష్ణ, బిల్లు కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని మునులపూడి పంచాయతీ కార్యదర్శి స్వేత, సర్పంచు రమణారెడ్డి కోరారు. బుధవారం స్థానిక సచివాలయంలో నిర్వహించన గ్రామసభలో మునులపూడి, రెడ్డిపాళెం గ్రామాల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. దోమల నివారణకు ఫాగింగ్, మురుగు కాలువల పరిశుభ్రత పనులు చేపట్టాలంటే ముందుగా ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు. అదే విధంగా గ్రామంలో అవసరమైన పనులు తెలియజేస్తే ఆ మేరకు తీర్మానం చేసి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏళ్ల తరబడి పనిచేయని చేతిపంపులకు మరమ్మతులు చేపట్టి మరో 2 రోజుల్లో వాడుకలోకి తీసుకురానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాణెం వెంకురెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

రాపూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ వర్గాల వారికి వ్యక్తిగత రుణాల మంజూరుకు ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7 వరకు ఆన్‌లైన్‌లో ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు కావాల్సిన కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయం, ఆధార్, రేషన్‌కార్డు, ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని, వయస్సు 21 నుంచి 50 సంవత్సరాల లోపు ఉండాలని ఆమె తెలిపారు. ప్రస్తుతానికి రాపూరు మండలానికి ఎస్సీ కార్పొరేషన్‌కి 32 యూనిట్లు, బీసీ కార్పొరేషన్‌కి 30 యూనిట్లు రుణ సదుపాయం ఉందని ఎంపీడీవో తెలిపారు.

మెప్మా విక్రయ కేంద్రం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కులో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ విక్రయ కేంద్రాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం ప్రారంభించారు. ఈ సందరగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా మెప్మా ద్వారా నామమాత్రపు వడ్డీతో ప్రభుత్వం కల్పిస్తున్న రుణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని చిన్న చిన్న వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ.శేషయ్య, కౌన్సిలర్ ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్‌లో అత్యధికంగా గోకులం షెడ్లు

నెల్లూరురూరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యధికంగా నెల్లూరు రూరల్లోనే రైతులకు గోకులం షెడ్లను కేటాయించామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొట్టేపాళెంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాఖ జేడీ డాక్టర్ కే రమేష్‌నాయక్‌తో కలిసి మాట్లాడుతూ ఇప్పటివరకు 36 ప్రాంతాల్లో పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల పెంపకందారులకు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచి ఏడుకొండలు, ఎంపీటీసీ నారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

మీటర్ రీడర్స్ క్యాలెండరు ఆవిష్కరణ

నెల్లూరు (జడ్పీ), జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటరు రీడర్స్ అసోసియేషన్‌కు చెందిన 2025 క్యాలెండరును ఆ శాఖ ఎస్ఈ విజయన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏవో మురళి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హజరత్ వలి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు

నెల్లూరు (జడ్పీ) : జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ జన్మదిన వేడుకలను జడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సీఈవో విద్యారమ, అధికారులు, ఉద్యోగులు కేక్ కట్ చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు పొందిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు. డిప్యూటీ సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

నెల్లూరు (వైద్యం) : పొట్టి శ్రీరాములు వాకర్స్ క్లబ్ నిర్వాహణలో మాడరన్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని ఎస్‌వీఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, పప్పు నారాయణ, సుబ్రహ్మణ్యం, హరినాథరెడ్డి, రవి, హెచ్‌ఎం. రమేష్‌బాబు, అంజాద్‌బాషా, సత్యం, కేశవులు, శీనయ్యశేగు రాము తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

ముత్తుకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థలో బుధవారం రోడ్డు భద్రతా నియమాలను పాటించడం, సురక్షితమైన డ్రైవింగ్ అలవాట్ల ప్రాముఖ్యతను తెలిపేందుకు రోడ్ సేఫ్టీ మార్చ్‌ను నిర్వహించారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వలన కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించడం, రోడ్లపై బాధ్యతాయుత ప్రవర్తనను ప్రోత్సహించడం లక్ష్యంగా హెచ్‌ఎస్‌ఈ, సెక్యూరిటీ బృందాలు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ హెడ్ సునీల్‌కుమార్ గుప్తా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




రోడ్ సేఫ్టీ మార్చ్ నిర్వహిస్తున్న ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ సిబ్బంది

పండు తెగులును నివారించుకోండి!

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : వరిలో మాని పండుతెగులు నివారణకు ప్రొపికోనజోల్ 1 మిల్లీలీటరు 1లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్, వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని దేవరమడుగు, రేబాలలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ పంటలో నమోదైన రైతుల వద్దనే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.




జోరేపల్లి, ఎంవీపురంలో పశువైద్య శిబిరాలు

రాపూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోరేపల్లి, ఎంవీపురం గ్రామాలలో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు వేశారు. 1400 గొర్రెలకు వ్యాక్సిన్ వేశామని డాక్టర్ ఎంవి అనీల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.



శత కీర్తి




నింగిలోకి పయనమవుతున్న రాకెట్ మొదటి దశ - రెండో దశ - మూడో దశ - రాకెట్ నుంచి విడిపోయి కక్ష్యలోకి చేరుతున్న నావిక్-02 ఉపగ్రహం

తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి వందవ రాకెట్ విజయవంతంగా రోదసిలోకి దూసుకుపోవడంతో షార్ ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతోంది. ఒకప్పుడు బయటి ప్రపంచాన్ని ఎరుగని ఏనాదులు జీవించే ఒక మారుమూల దీవి, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అంతరిక్ష ప్రయోగ కేంద్రంగా మారిన పరిణామాలను ఈ ప్రాంతపు వాసులు గుర్తు చేసుకుంటున్నారు. తొలి రోజుల్లో షార్ అభివృద్ధిలో భాగం అయిన శాస్త్రవేత్తలు, ఇతర ఉద్యోగులు వందో విజయ సందర్భంలో సంబరపడుతున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు తెలిమంచు తెరలను చీల్చుకుంటూ జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది. ఈ దృశ్యాన్ని ఈ ప్రాంత ప్రజలంతా ఇళ్ల బయటకు వచ్చి ఆనందంతో వీక్షించారు. పొగ చారలు ఆకాశంలో మిగిల్చి అంతరిక్షంలోకి నావిగేషన్ ఉపగ్రహం నావిక్-02 ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి వందవ రాకెట్ చేర్చడంతో షార్ శాస్త్రవేత్తలు ఆలింగనాలూ, కరచాలనాలతో అభినందలు తెలుపుకున్నారు. ఈ విజయం షార్ భవిష్యత్తుకు కూడా కీలకం కానుంది. మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణ నిర్ణయంతో, గత కొన్నేళ్లుగా స్తబ్దుగా మారిన శ్రీహరికోటలో మళ్లీ సందడి నెలకొననుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి ఐదువేల మందిదాగా బుధవారం శ్రీహరికోటకు తరలివచ్చారు. మంచు కురుస్తున్నా చలిని సైతం లెక్కచేయకుండా గ్యాలరీలో కూర్చున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు వాహనాలు తెల్లవారుజామునుంచే బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో చప్పట్లు, ఈలలు, కేరింతలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

విద్యార్థులతో కలిసి వీక్షించిన కలెక్టర్

సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాకెట్ ప్రయోగాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దంపతులు, ఆర్డీవో కిరణ్మయి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షించారు. సైన్సు ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హిమ, అన్విని లకు కూడా కలెక్టర్‌తో పాటు మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న 500 మంది విద్యార్థులకు రాకెట్ ప్రయోగాన్ని విజిటర్స్ గ్యాలరీ నుంచి వీక్షించే అవకాశం కల్పించారు.



మిషన కంట్రోలర్ సెంటర్‌లో ఇస్రో ఛైర్మన్ నారాయణన్, షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఆర్డీవో కిరణ్మయి, విద్యార్థులు



రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఇస్రో మాజీ ఛైర్మన్లు



మంచు తెరలు చీల్చుకుంటూ.. నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన వందో రాకెట్

రాకెట్ వీక్షణకు మాజీ ఇస్రో ఛైర్మన్‌లు..

షార్ వేదికగా జరిగిన వందో రాకెట్ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ ఛైర్మన్లు డాక్టర్ ఎస్.సోమనాథ్, డాక్టర్ కె.రాధాకృష్ణ, శివన్, ఏఎస్.కిరణ్ కుమార్ శ్రీహరికోటకు వచ్చారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు. వందో ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించగానే ఆనందోత్సాహాలు ప్రకటించారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

- జీవకోనలో పర్యటించిన కమిషనర్ మౌర్య
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో వినతులకు స్పందన



మరమ్మతులకు గురైన బోరును పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి (జీవకోన), జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ జీవకోన ప్రాంతంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' నినాదంతో ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం జీవకోన ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానంగా నీటి సమస్యను స్థానికులు ప్రస్తావించారు. మరిన్ని సమస్యలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో బుధవారం 48, 49 డివిజన్లలో కమిషనరు మౌర్య పర్యటించారు. ప్రతి వీధి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. పలుచోట్ల నీటి సమస్య అధికంగా ఉందని, మరింత మెరుగ్గా పారిశుధ్యం పనులు చేపట్టాలని స్థానికులతో పాటు కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ కోరారు. పలు సమస్యలను ప్రస్తావించారు. కాగా, ప్రధానమైన నీటి సమస్యను అధిగమించేందుకు తక్షణమే బోర్లు, మోటార్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనరు మౌర్య సూచించారు. మురుగునీటి కాలువలకూ మరమ్మతులు, లేనిచోట్ల పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చాలని, తడి పొడిచెత్త వేర్వేరుగా ఇచ్చేలా చూడాలని, బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కాగా, దెబ్బతిన్న డ్రైన్ల స్థానంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టాలని కమిషనరును కలిసి మాజీ సర్పంచి అన్నా రామకృష్ణ కోరారు. బోర్లను మరమ్మతులుచేస్తే నీటి సమస్యను కొంత మేర అధిగమించవచ్చని సూచించారు. మరిన్ని సమస్యలను ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, అధికారులు రవి, ఏసీపీ బాలాజీ, సర్వేయర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాల పరిశీలన

సమస్యల పరిష్కార వేదికలో స్థానికుల నుంచి వచ్చిన వినతి మేరకు రాజీవ్ గాంధీ కాలనీ వద్ద ఉన్న శ్మశాన వాటికలను కమిషనర్ పరిశీలించారు. శ్మశానాలను శుభ్రంగా ఉంచాలన్నారు. గేటు ఏర్పాటు చేసి ఆకతాయిలు రాకుండా చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు.



మొదలైన రోడ్డు పనులు

తిరుమల బైపాస్‌రోడ్డు నుంచి సత్యనారాయణపురం సర్కిల్‌కు వెళ్లే విరజా మార్గం.. వంద మీటర్ల వరకు అసంపూర్తి ఉంది. దీనివల్ల ప్రజలుపడే ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై కమిషనర్ మౌర్య స్పందిస్తూ మిట్ట ప్రాంతం వద్ద సిమెంటు రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. పనులూ ప్రారంభించారు.

తండ్రి వెంటే వెళుతూ..!

- స్వర్ణముఖి వాగులో పడి బాలుడి మృతి
- ఈ విషయం తెలియక పోలీసులకు ఫిర్యాదు
- వాగులో కనిపించిన మృతదేహం

చంద్రగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బుడిబుడి అడుగులేస్తూ తండ్రి వెనక వెళ్లాడో మూడేళ్ల బాలుడు. ఆ విషయం తండ్రికి తెలియదు. స్వర్ణముఖి వాగు దాటే క్రమంలో బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ విషాద ఘటన బుధవారం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ పాతపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాతపేటకు చెందిన లోకేశ్, శరణ్యదంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు. బుధవారం తై అమాస్య కావడంతో.. చనిపోయిన తన తండ్రి రంగాచారికి ఉదయం 11 గంటల సమయంలో లోకేశ్, కుటుంబీకులు ఇంట్లో బట్టలు పెట్టారు. ఆ తర్వాత తన తండ్రి గుంత(సమాధి) వద్దకు లోకేశ్ వెళ్లారు. ఇంటి దగ్గర ఆడుకొంటున్న చిన్న కుమారుడు తేజ(3) తండ్రి వెనకాలే వెళ్లిపోయాడు. ఇది గమనించని లోకేశ్.. స్వర్ణముఖి వాగు దాటుకొని తండ్రి గుంత వద్దకు వెళ్లి.. తిరిగి ఇంటికొచ్చారు. తేజ కనిపించకపోవడంతో గాలించారు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో జాతీయ రహదారిలో గాలింపు చర్యలు చేపట్టారు. గాందంకి టోల్‌ప్లాజా వద్ద సీసీ పుటేజ్‌ను పరిశీలించారు. అనుమానంతో దామలచెరువు వరకు వాహనాలు తనిఖీ చేశారు. స్వర్ణముఖి వాగులో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన పశువుల కాపరులు గ్రామస్థులకు సమాచారమిచ్చారు. తమ కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చంద్రగిరి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




తేజ (ఫైల్ ఫొటో) - ఒడిలో బిడ్డ మృతదేహం పెట్టుకుని రోదిస్తున్న తల్లి

పద్మావతి వర్సిటీ దూర విద్యకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రం నిర్వహించే పలు కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఎంఏ సంగీతం, తెలుగు, ఎంకాం, మ్యూజిక్‌లో డిప్లొమో వంటి కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 31 నుంచీ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు ఫిబ్రవరి 5వ తేదీ చివరి గడువు. ఫిబ్రవరి 7 నుంచీ 12 వ తేదీ దాకా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్ కానీ, 0877-2284524 లేదా 8121787415 నెంబర్లలో సంప్రదించాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

జిల్లాలో తగ్గుముఖం

- నేడు ప్రపంచ కుష్ఠు నివారణ దినోత్సవం



కుష్ఠుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి(వైద్యం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠు వ్యాధి కేసులు తగ్గుముఖం పట్టాయి. దీనిపై ప్రజల్లో కొంత అవగాహన పెరగడం.. సకాలంలో వైద్యం అందడంతో కేసులు తగ్గాయి. జిల్లాలో మొత్తం 901 మంది కుష్ఠుతో బాధపడుతున్నారు. వీరిలో 123 కేసులు ఏడాదికాలంలో నిర్వహించిన సర్వేలో వైద్య సిబ్బంది గుర్తించినవి. వీరిలో 48 మంది వ్యాధి తక్కువ(మొదటి దశలో) ఉండగా, 75 మంది పూర్తి లక్షణాలతో ఉన్నట్లు తేలింది. 14 ఏళ్లలోపు ఉన్న 14 మంది చిన్నారుల్లోనూ కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నట్లు ఇటీవల గుర్తించారు. ఎక్కువగా వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నారాయణవనం, నాగలాపురం, బుచ్చినాయుడకండ్రిగ, చిన్నపాండూరు వంటి మారుమూల ప్రాంతాల్లోనే ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. దీంతో అక్కడ నిరంతరం సర్వే చేస్తూ, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు చేపడుతున్నారు.

ప్రభుత్వ వైద్యం, సాయం

2027 నాటికి ఒక్క కొత్త కేసు కూడా నమోదు కాకూడదనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. కుష్ఠు లక్షణాలున్న వారిని సర్వేలో గురిస్తే ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు, చికిత్స అందిస్తున్నారు. వేళ్ల వంకర్లు తిరిగిన వారిని పలమనేరు, నెల్లూరు, తమిళనాడులోని కనిగిరిలో ఉన్న ప్రత్యేక ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీనికయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించడంతో పాటు సాయంగా రూ.12 వేలనూ అందిస్తోంది. అవసరమైన వారికి ఏడాదికి రెండు జతల ఎంసీఆర్ చెప్పులూ ఇస్తోంది. కుష్ఠు వల్ల అంగవైకల్యం బారిన పడిన 732 మందికి ప్రతి నెలా రూ.6 వేల పింఛను ఇస్తోంది. వచ్చే ఏడాదికి ఒక్క కొత్త కేసు కూడా నమోదు కాకూడదనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

ఏకలవ్య ఆదర్శ గురుకుల నిర్మాణానికి అదనంగా రూ.1.93 కోట్లు

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఎన్ కండ్రిగలో ఏకలవ్య ఆదర్శ గురుకుల భవనాల నిర్మాణ అంచనాలను గిరిజన సంక్షేమశాఖ సవరించింది. 2015లో రూ.12 కోట్లు మంజూరు చేయగా, హైదరాబాదుకు చెందిన ఓ సంస్థ 16.16 శాతం తక్కువ మొత్తంతో పనులు దక్కించుకుంది. పనులు పూర్తయ్యాక నిధులు చాలక బిల్లులు పెండింగులో పడ్డాయి. దీంతో లెస్ టెండర్ల ద్వారా ఆదా అయిన రూ.1.93 కోట్లను ఇప్పుడు అదనంగా మంజూరు చేయాల్సి వచ్చింది.

'సూపర్ సిక్స్' అమలవుతుంది

- కలిసి కట్టుగా రాక్షసపార్టీ ఉనికి లేకుండా చేద్దాం
- 'కూటమి' నేతలు, శ్రేణులకు మంత్రి సత్యకుమార్ పిలుపు




తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తుందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పష్టంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో వెంటిలేటర్‌పైకి చేరిన రాష్ట్రానికి.. ఏడు నెలలుగా కూటమి ప్రభుత్వం ఆక్సిజన్ అందించి నడిపిస్తోందన్నారు. తిరుపతిలో బుధవారం జరిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తూ మన బలాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో కూటమికి 57 శాతం.. వైసీపీకి 39 శాతం వచ్చాయని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో ఆ 39 శాతాన్ని మనం కైవసం చేసుకునేలా కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలు వేరైనా ఒక్కటిగా పనిచేస్తూ రాబోయే ఎన్నికల్లో రాక్షస పార్టీ ఉనికి లేకుండా చేద్దామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి బాట ఎక్కించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ ఏడు నెలల్లో పోలవరానికి కేంద్రం రూ.12వేల కోట్లు ఇచ్చింది. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో రాజధాని నిర్మాణం ఊపందుకుంది. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రణాళికమేరకు కేంద్రం రూ.15 వేల కోట్లను రాజధానికి అందజేసింది. ప్రపంచం అబ్బురపడే రాజధాని ఎన్డీయే కాలంలోనే సాకారమవుతుంది' అని మంత్రి తెలిపారు. ఇన్ని పనులు శరవేగంగా జరుగుతుంటే.. పెన్షన్ పెంపు, ఉచిత సిలిండర్లు ఇస్తుంటే.. ఇవన్నీ మర్చిపోయి కొందరు సూపర్ సిక్స్ అంటున్నారన్నారు. అవీ అమలవుతాయని స్పష్టంచేశారు. ఈ విషయంలో మన నాయకులు, కార్యకర్తలే మన ప్రభుత్వాన్ని విమర్శిస్తుండటం సరికాదన్నారు. 'రాష్ట్రానికి చికిత్స జరుగుతోంది. త్వరలో అన్నీ చక్కబడతాయి. కూటమి కార్యకర్తలు, అభిమానులు కాస్తంత సంయమనం పాటించాలి' అని కోరారు.



భరద్వాజతీర్థానికి స్వామి అమ్మవార్ల వేంచేపు

శాస్త్రోక్తంగా తై అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బుధవారం తై అమావాస్య ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠింపజేసి భరద్వాజతీర్థంలోని శివాలయం వద్దకు వేంచేపు చేశారు. అక్కడ స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను తిరిగి ఊరేగింపుగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి తీసుకువచ్చారు. పూజలు నిర్వహించాక ఉత్సవర్లను పట్టణంలో ఊరేగించారు.ఆలయ ఈవో బాపిరెడ్డి, బొజ్జల బృందమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





స్వామి అమ్మవార్లకు నిర్వహిస్తున్న అభిషేకం.. హాజరైన భక్తులు

సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 4 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,310

తలనీలాలు సమర్పించినవారు: 17,310



100 షార్ మైలు రాళ్ళు



పులికాట్ సరస్సుకూ, బంగాళాఖాతానికీ నడుమ ఉండే శ్రీహరికోట ఒకప్పుడు చిన్నదీవి. అడవి మీద ఆధారపడి నాగరిక ప్రపంచం ఎరుగని ఏనాదులు ఉండేవారు. వ్యవసాయం చేసుకుంటూ తూర్పు రెడ్లు చిన్న చిన్న ఊళ్లుగా ఉండేవారు. 1970ల నుంచీ ఈ దీవి రూపు రేఖలు మారిపోయాయి. సూళ్లూరుపేట నుంచి పులికాట్‌ను చీలుస్తూ రోడ్డు వేయడంతో ప్రధాన భూభాగంతో కలిసిపోయింది. 1969లో రాకెట్‌ల ప్రయోగానికి అనువైన ప్రదేశం అని శ్రీహరికోటను గుర్తించిన తర్వాత నిర్మాణాలు పెరిగాయి. ప్రయోగాల వేదికగా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. సైకిల్ మీద రాకెట్‌లను మోసుకొచ్చి ప్రయోగించిన దశ నుంచి అంతరిక్షంలో ఏకంగా ఒకశాశ్వత ప్రయోగశాలనే నిర్మించే దిశగా జరుగుతున్న పరిణామాలకు ప్రధాన కేంద్రంగా శ్రీహరికోట మారింది. అవసరాలకు అనుగుణంగా రాకెట్లను రూపొందించుకుంటూ వందవ రాకెట్‌ను బుధవారం నింగిలోకి సగర్వంగా శ్రీహరికోట ఎగరేసింది.

ఈ సందర్భంగా వంద రాకెట్ల విశేషాల సమాహారం...

- కథనం - సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)




చిన్న ప్రయోగాలతో ప్రారంభం.. నేడు భారీ ప్రయోగాలు


ఎస్‌ఎల్వీ-డీ 1తో శ్రీకారం

1979 ఆగస్టు 19న తొలిసారిగా ఎస్‌ఎల్వీ-డీ1 పేరుతో 40 కిలోల బరువు కలిగిన రోహిణి-1 ఉపగ్రహాన్ని షార్ నుంచి రోదసీలోకి పంపారు. అతి తక్కువ బరువు కలిగిన ఈ ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా ఉన్న లియో అర్బిట్‌లోకి పంపించారు. ఈ సిరీస్‌లో 1983 వరకు ఐదేళ్లలో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. అనంతం 1980 జూలై 18న 35 కిలోల ఆర్‌ఎస్-1 ఉపగ్రహం, 1981 మే 31న 38 కిలోల బరువుగల ఆర్‌ఎస్-డీ1 ఉపగ్రహం, 1983 ఏప్రిల్ 17న 41.5 కిలోల బరువు గల ఆర్‌ఎస్-డీ2 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు.

రెండో రాకెట్... ఏఎస్‌ఎల్వీ

1987 మార్చి 24న ఏఎస్‌ఎల్వీ-డీ1 పేరుతో 150 కిలోల బరువు గల స్రాస్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. 100 కిలోల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు రెండో దశలో రూపొందించుకున్న రాకెట్ ఇది. 1987 నుంచి 1994 మధ్యలో ఈ సిరీస్‌లో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. రెండు దశల ఘన ఇంధనం వినియోగించే రాకెట్ ఇది.





ఇస్రో విజయ కెరటం పీఎస్‌ఎల్వీ

1993 సెప్టెంబరు 20న పీఎస్‌ఎల్వీ-డీ1 రాకెట్ తొలి ప్రయోగం విఫలమైంది. అయితే 1994 అక్టోబరు 15న 804 కిలోల బరువుతో ఐఆర్‌ఎస్-పీ2 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఆ తర్వాత ఈ రాకెట్ విజయ రికార్డులను నెలకొల్పుకుంటూ వెళ్తోంది. తక్కువ బరువు కలిగిన విదేశీ ఉపగ్రహాలు కూడా పీఎస్‌ఎల్వీల ద్వారానే ప్రయోగించారు. చంద్రయాన్-1, ఐఆర్‌ఎన్‌ఎస్ వంటి సిరీస్ ప్రయోగాలు దీని ద్వారానే అంతరిక్షంలోకి పంపారు. ఇప్పటి వరకు ఈ సరీస్‌లో 62 ప్రయోగాలు చేపట్టారు. రెండు ప్రయోగాలు మినహా మిగిలినవన్నీ విజయవంతం అయ్యాయి. ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశ పెట్టిన అద్భుత రాకెట్ ఇది.

- 1993 నుంచి 2003 వరకు పదేళ్లలో పీఎస్‌ఎల్వీ ప్రయోగాలు 8.
- 2004 నుంచి 2014 వరకు 21 ప్రయోగాలు
- 2015 నుంచి 2004 చివరి వరకు 33 ప్రయోగాలు



భవిష్యత్‌లో..

గగన్‌యాన్ మిషన్ ప్రయోగం, చంద్రయాన్-4 వంటి భారీ ప్రయోగాల పై దృష్టిసారించారు. షార్‌లో రెండు ప్రయోగ వేదికలు, నాలుగు అనుసంధాన భవనాలు, ఎంఎస్‌టీ టవర్ వసతులు ఉన్నాయి. మూడో లాంచ్‌ప్యాడ్ అత్యంత అధునాతన వసతులతో నిర్మించేందుకు ఈ ఏడాదే భూమిపూజ చేయనున్నారు. ఈ లాంచ్ ప్యాడ్‌ను రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా నిర్మాణం చేపట్టనున్నారు. దీని ద్వారా ఏకంగా 20 నుంచి 30 టన్నుల బరువు గల భారీ ఉపగ్రహాలను ప్రయోగించవచ్చుని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



కమ్యూనికేషన్ కోసం జీఎస్‌ఎల్వీ

2001లో ఏప్రిల్ 18న జీఎస్‌ఎల్వీ-డీ1 రాకెట్ ద్వారా 2 వేల కిలోల బరువు కలిగిన జీశాట్-1 ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. అత్యంత బరువు గల కమ్యూనికేషన్ ఉపగ్రహాలను పంపేందుకు ఇస్రో ఈ రాకెట్‌కు రూపకల్పన చేసింది. ఈ రాకెట్‌లో క్రయోజనిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తొలుత రష్యా నుంచి పొందినా, తర్వాత పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే వీటిని ప్రయోగిస్తున్నారు. ఈ సిరీస్‌లో మొత్తం 17 ప్రయోగాలు చేపట్టగా నాలుగు మాత్రమే విఫలం చెందాయి.



భారీ ఉపగ్రహాల కోసం ఎల్‌వీఎం3..

2014 డిసెంబరు 18న తొలిసారిగా ఈ ఎల్‌వీఎం3 ద్వారా క్రూ మాడ్యూల్ రీ ఎంట్రీ విజయవంతంగా చేపట్టారు. అనంతరం 2017 జూలై 5న ఎల్‌వీఎం3-డీ1 ద్వారా జీశాట్-19 కమ్యూనికేషన్ రంగానికి చెందిన ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. 2014 నుంచి 2023 వరకు ఈ సిరీస్‌లో మొత్తం 7 ప్రయోగాలు చేపట్టగా 7 విజయం చెందాయి. ఈ వాహక నౌక ద్వారానే చంద్రయాన్-1, చంద్రయాన్-3 ఉపగ్రహాలు పంపారు. నాలుగు నుంచి 5 టన్నుల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు ఎల్‌వీఎం3 వాహక నౌక రూపొందించారు.

బుల్లి వాటి కోసం ఎస్‌ఎస్‌ఎల్వీ

2022 ఆగస్టు-07న ఎస్‌ఎస్‌ఎల్వీ రాకెట్ ద్వారా ఈవోఎస్-02 ఉపగ్రహం పంపారు. ఇవి విఫలం చెందింది. అనంతరం వివిధ పరీక్షలు నిర్వహించి తిరిగి 2023 ఫిబ్రవరి 10న ఈవోఎస్07 ఉపగ్రహాన్ని ఇదే రాకెట్ ద్వారా పంపి విజయం సాధించారు. అనంతరం 2024 ఆగస్టు 16న ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం చేపట్టారు. ఈ సిరీస్‌లో మొత్తం మూడు ప్రయోగాలు చేపట్టారు. తక్కువ బరువు గల ఉపగ్రహాలను రోదసీలోకి పంపేదుకు ఇస్రో ఎస్‌ఎస్‌ఎల్వీని అందుబాటులోకి తెచ్చింది.







డివైడర్‌పైకి ఎక్కిన బస్సు- మృతిచెందిన మురళి

తండ్రి కర్మక్రియల నాడే..

- బస్సు ఢీకొని కుమారుడి దుర్మరణం -

దొరవారిసత్రం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తండ్రి కర్మక్రియలరోజే బస్ ఢీకొని ప్రాణాలు కోల్పోయాడో వ్యక్తి. పోలీసుల కథనం ప్రకారం.. దొరవారిసత్రం మండలం నెలబల్లికి చెందిన చిట్టిబోయిన మురళి(49) వ్యవసాయం చేస్తుంటాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదిరోజుల క్రితం ఇతని తండ్రి సుబ్బరామయ్య చనిపోయారు. పెద్ద కుమారుడిగా మురళి తన తండ్రి కర్మక్రియలను బుధవారం నిర్వహించారు. అవి ముగిశాక రాత్రి పనిమీద బైకుపై బయటకు వెళ్తున్నారు. హైవే కూడలి వద్ద ఇతడి వాహనాన్ని అపాచీ కార్మికులను తీసుకువెళ్తున్న ట్రావెల్ బస్ ఢీకొని డివైడర్‌పైకి ఎక్కేసింది. దీంతో మురళి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వెంటనే స్థానికులు బస్సును చుట్టుముట్టారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ అక్కడికి వెళ్లి కార్మికులను మరో బస్సులో పంపించారు. అనంతరం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్మక్రియలు చేసిన ఇంట్లో కొన్ని గంటలు కూడా ముగియకుండానే మరొకరు చనిపోవడంతో విషాద వాతావరణం నెలకొంది. పదిరోజుల వ్యవధిలో తండ్రీకొడుకులు మరణించడాన్ని కుటుంబ సభ్యులు తట్టుకోలేకపోతున్నారు. పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేశారు.







మృతి చెందిన గణేష్, లక్ష్మీనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

పిచ్చాటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రెప్పాలపట్టు అటవీమార్గంలో తులసికృష్ణాపురం క్రాస్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. శ్రీకాళహస్తి మండలానికి చెందిన గణేష్(25), మిట్టకండ్రిగకు చెందిన చెర్లోపల్లి లక్ష్మీనారాయణ(30) ద్విచక్రవాహనంలో పిచ్చాటూరుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో తులసికృష్ణాపురం క్రాస్ వద్ద వీరి బైక్‌ను కారు ఢీకొంది. సంఘటనా స్థలంలోనే వీరిద్దరూ దుర్మరణం చెందారు. కారు డ్రైవర్ పరారయ్యాడు. సమీపంలోని పశువుల కాపర్లు ప్రమాద విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గణేష్‌కు పెళ్లి కాలేదు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

భూమి ఆన్‌లైన్ చేయలేదంటూ

ఆత్మహత్య బెదిరింపు

- ఇద్దరు యువకులపై కేసు నమోదు

డక్కిలి, జనవరి 29 : (ఆన్‌లైన్) : తాము ఆక్రమించుకున్న భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని ఇద్దరు ఇద్దరు అన్నదమ్ములు పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు చేసిన యత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్న వైనమిది. దగ్గవోలుకు చెందిన దామిశెట్టి రవికుమార్, చంద్రశేఖర్‌లు తండ్రి క్రిష్ణయ్యతో కలిసి బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తాము సాగు చేసుకొంటున్న భూములను ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు చేయడం లేదంటూ డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. తహసీల్దార్ రాగానే సమస్యను ఆయనకు నివేదిస్తానని డిప్యూటీ తహసీల్దార్ బదులిచ్చారు. ఈలోగానే ఆ అన్నదమ్ములు అసహనంతో బయటకు వచ్చి వెంట తెచ్చుకొన్న పెట్రోలు ఒకరిపై ఒకరు చల్లుకొన్నారు. రెవెన్యూ సిబ్బంది గమనించి వెంటనే అడ్డుకున్నారు. విషయం తెలిసి తహసీల్దార్ వచ్చి సర్వేయర్‌తోపాటు వారిని వెంటబెట్టుకొని క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. రవికుమార్,చంద్రశేఖర్ సాగు చేస్తున్న 3.92 ఎకరాల భూమి రెవెన్యూ పోరెస్టుకు చెందినదని తేల్చారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడమే కాకుండా తమ విధులకు ఆటంకం కలిగించారని ఈఅన్నదమ్ములపై డిప్యూటీ తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా

'సామంచి' బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సామంచి శ్రీనివాస్ బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు మంత్రి సత్యకుమార్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి ఆడిటోరియం వరకు సమాంచి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు చేపట్టారు. ఎస్వీయూలో విద్యార్థి నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేసిన సామంచి శ్రీనివాస్.. వామపక్ష భావాలుగల వారితో విబేధించి జైలు జీవితం కూడా గడిపారని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తుచేశారు. ఆయన కృషికి తగిన గౌరవం లభించిందన్నారు. సీనియర్లను గౌరవిస్తూ, కొత్తవారిని కలుపుకుంటూ, కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తూ పనిచేయాలని సూచించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ సమర్థంగా అధ్యక్ష బాధ్యతలను నెరవేరుస్తారని చంద్రగిరి ఎమ్మెల్యే నాని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన, కీలకమైన జిల్లా బాధ్యతలను సామంచికి ఇవ్వడం ఆయన సామర్థ్యానికి గీటురాయి అని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. తాను, సామంచి కలిసి ఎన్నో పోరాటాలు చేశామని, జైలు జీవితం కూడా గడిపామని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్ష బాధ్యతలకు ఆయన న్యాయం చేస్తారన్నారు. 30 సంవత్సరాలుగా తనను ఎందరో పెద్దలు, నాయకులు, కార్యకర్తలు వెన్నుతట్టి ప్రోత్సహించారని, అండదండలు అందించారని సామంచి శ్రీనివాస్ చెప్పారు. వారందరి సహకారంతోనే తాను ఈ స్థానానికి చేరుకోగలిగానన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని పనిచేస్తానని, సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా యూకేకు చెందిన పారిశ్రామికవేత్త బాలకృష్ణారెడ్డి, అబుదాబికి చెందిన శ్రీనివాసరెడ్డి, తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గుణకల మురళి తదితరులు సామంచిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, కల్లపల్లి నరసింహారెడ్డి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, చంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న సామంచి

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆక్రమణల బారిన చెరువు పోరంబోకు భూములు


మాచవరంలో ఆక్రమణలో చెరువు భూమి

ఓజిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేస్తున్నా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. మాచవరం, ఇనుగుంట, అరిమేనిపాడు, సగుటూరు, కొండవల్లిపాడు, కొత్తచెరువు తదితర గ్రామాల్లో చెరువు పోరంబోకు, ప్రభుత్వ భూములు ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్నాయి. ఆక్రమణల కట్టడికి గ్రామ రెవెన్యూ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడలేదు. ఆక్రమణల భూముల విషయంలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు సరైన రీతిలో స్పందించాల్సిన అవసరముంది.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత: పాశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక చవటగిరి జనకాలనీలో ఆయన అధికారులతో గ్రామసభ నిర్వహించారు. ప్రజల అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ చవటగిరిజనకాలనీలో తాగునీరు, వీధిదీపాలు, రోడ్లు, డ్రైనేజీకాలువలను అభివృద్ధిపరుస్తామన్నారు. అర్జీలను సత్వరమే అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పిట్టి నాగరాజు, తహసీల్దారు చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : బీజేపీ


గీతాకుమారికి వినతిపత్రమిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గీతాకుమారిని బుధవారం బీజేపీ నాయకులు సత్కరించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, దయాకర్, చావా వాసుదేవరావు, సురేష్‌బాబు, బాలకృష్ణ, శివ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల కట్టడి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తిరుపతయ్య, ప్రిన్సిపాల్ రవిప్రసాద్

గూడూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునని ఒకటో పట్టణ ఎస్‌ఐ తిరుపతయ్య అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లను ధరించి వాహనాలను నడపాలన్నారు. అధికవేగం ప్రమాదకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి

కోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అల్లంపాడులో భూముల రీసర్వేను బుధవారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. అల్లంపాడుతోపాటు పలు మజిర గ్రామాల్లో 8 రోజులుగా రీసర్వే జరుగుతోంది. ఈ పంచాయతీలోని 851.30 ఎకరాల భూములను మండల సర్వేయర్ గోపీరెడ్డి ఆధ్వర్యంలో విలేజ్ సర్వేయర్లు, నలుగురు వీఆర్వోలు, రీసర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో తహసీల్దారు జయజయరావు సర్వేను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకొని కొన్ని అక్కడే పరిష్కరించారు.

డీకేటీ భూముల్లో అక్రమ గ్రావెల్ రవాణా అడ్డుకోండి

కోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గూడలి పంచాయతీ ఓటిగుంట డీకేటీ భూముల్లో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎస్ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు నాగేంద్ర కోరారు. ఆయన ఆధ్వర్యంలో గూడలి అరుంధతీయులు డిప్యూటీ తహసీల్దారు అజ్మతుల్లాఖాన్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. సర్వేనంబరు 442లో1బీ, 443లోని 33 ఎకరాల డీకేటీ భూములను 50 ఏళ్లక్రితం తమ పూర్వీకులకు సీలింగ్ కింద రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారన్నారు. ఈ భూములతోపట్టుల కింద ఉన్న ప్రభుత్వ భూములను కూడా కొద్దికొద్దిగా ఆక్రమించుకుని తామే సాగుచేసుకొని బతుకుతున్నామన్నారు. కొంతమంది అక్రమంగా తమ భూములతోపాటు ప్రభుత్వ భూముల్లో కూడా గ్రావెల్ ఎత్తేసి సొమ్ము చేసుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటా: రామ్‌కుమార్


కార్యకర్తలతో మాట్లాడుతున్న రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నివాసంలో ఆయన కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో పార్టీ అధినేత జిల్లాల పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. తండ్రిని కోల్పోయిన కౌన్సిలర్ కల్యాణిని, పితృ వియోగంతో బాధపడుతున్న మన్నారు పాటూరు ప్రసాద్ రెడ్డిలను పరామర్శించారు. వెందోడు కార్తీక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులపై తహసీల్దార్ ఆరా


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెళ్లకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు, చిల్లకూరు, జీలపాటూరు పాఠశాలలను బుధవారం తహసీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి సందర్శించారు. ఆయా పాఠశాల్లో మౌలిక వసతులు,విద్యార్థుల హాజరవుతున్న పట్టికను పరిశీలించారు. తరగతి గదుల్లో పట్టిక ప్రకారం విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలల హెచ్‌ఎంలతో పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట వీఆర్వోలు తేజ, వంశీకృష్ణ ఉన్నారు.

ఏపీ హంస క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ-హంస) వార్షిక క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా, నేతలు టాటాబాయి, ఇమ్రాన్, గిరి, శ్రీనివాస్, వెంకటసుబ్బమ్మ, రాజేష్, సురేంద్ర, మైనంపాటి మునిరాజా, పద్మజ, శాంతకుమార్, స్వర్ణలత, గంగమ్మ, జయలక్ష్మి, జ్యోతిలక్ష్మి, ముకేష్, నరేష్ పాల్గొన్నారు.



ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతుకు ఆ ధాన్యం చేతికొస్తే ఆ కళ్లలోని ఆనందం అంతాఇంత కాదు... ఈ ఏడాది తుఫాన్ రైతులకు కొంత పంట నష్టం చేకూర్చినా కొద్దోగొప్పో ధాన్యం చేతికొచ్చాయి. తడ మండలంలో వారం రోజులుగా వరికోతలు మొదలయ్యాయి. దీంతో రహదారులే కళ్లాలుగా మారాయి. చేనిగుంట, తడ, జాతీయ రహదారుల పక్కన ధాన్యంరాశులు గుట్టగా పోసి వాటిని ఆరపెట్టుకోవడం కన్పించింది. -తడ,ఆంధ్రజ్యోతి

తగ్గిన దిగుబడులపై వరి రైతుల దిగాలు



వరి పంట కోతలో యంత్రాలు - నూర్పిడి తర్వాత ధాన్యం బస్తాలను లారీలోకి లోడ్‌చేస్తున్న కూలీలు

బాగా నష్టం వస్తుంది



వెదురుపట్టు రోడ్డు పక్కన 13 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఎకరానికి 23 బస్తాలు దిగుబడి వచ్చింది. ఇప్పటి రేట్లకు అమ్మితే ఎకరానికి పెట్టుబడి పోను రూ.3350 వేలు వరకు నష్టం వస్తుంది.

- షేక్ మౌలాసాహేబ్, వేములబాక

అకాల వర్షంతో నిరాశ



మూడెకరాల్లో కెఎన్ఎం రకం వేశాను. 66 బస్తాల దిగుబడి వచ్చింది. ఇంత దారుణంగా దిగుబడి రావడం ఇదే మొదట సారి. ఎద్దిన సాగు చేయడంతో దిగుబడులు రాలేదు. ఈనెల 18న పడిన వర్షం వల్ల దిగుబడి తగ్గిపోయింది.

- కర్పూరం రాజేష్, నెలబల్లి

దొరవారిసత్రం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల నుంచి వరి కోతలు, నూర్పిడిలు మొదలయ్యాయి. అక్కరపాక, నేలపట్టు, మైలాంగం, పడమట్టికండ్రిగ, శ్రీధనమల్లి, కల్లూరు గ్రామాల్లో ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. వ్యవసాయ అధికారుల అంచనాల ప్రకారం 6,240 హెక్టార్లలో వరి సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవడంతో అంచనాకు మించి 8 వేల హెక్టార్లలో సాగు చేసినట్లు భావిస్తున్నారు. అయితే ఈ యేడాది దిగుబడి తగ్గడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.. ఎకరానికి 20-25 బస్తాలకు మించి దిగుబడిరావడంలేదు. ఎక్కువమంది కెఎన్ఎం(1638) రకాన్ని సాగుచేశారు. కొందరు బీపీటీ-5204 సాగు చేశారు. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఎద్ది, నారుమడి పద్ధతుల్లో నాట్లు వేశారు. జనవరిలో కంకి దశకు చేరుకుంది. అదే సమయంలో వర్షాలు కురవడంతో దిగుబడి తగ్గిందని అధికారులు చెబుతున్నారు. దిగుబడులు తగ్గడంతో కౌలు రైతు పరిస్థితి దారుణంగా ఉంది. ఎకరం సాగుకు సుమారు రూ.30వేలు పెట్టుబడి అవసరం. ఇప్పుడు సగటున 25 బస్తాలు దిగుబడి వస్తే మిగిలేదేమీ ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కోతలు ప్రారంభమై వారం గడిచినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల జాడలేదు. దళారులు వచ్చి బస్తా(75 కిలోలు) బీపీటీ (5204), కెఎన్ఎం(1638) రకాలకు రూ.1450-రూ.1600 ఇస్తున్నారు.

పెట్టుబడికి సరిపోయింది



ఎకరం పొలంలో కెఎన్ఎం రకం వేశాను. పంట నేల కొరగడంతో గింజరా లిపోయింది. ఎకరానికి 19 బస్తాలు వచ్చాయి. పెట్టుబడికి సరిపోయింది. నాలుగు నెలల కష్టం కూడ రాలేదు.

- పాకాల నాగులయ్య, నెలబల్లి

పూరిల్లు దగ్ధం

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌లో బుధవారం ఓ పూరిల్లు దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ అధికారి విజయ్ కుమార్ వివరాల మేరకు... స్థానిక రమణయ్య అనే వ్యక్తి చెందిన పూరింటిపై టపాసుల నిప్పురవ్వ పడి ప్రమాదం జరిగిది. మంటలను అదుపుచేశామన్నారు. లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నాయుడుపేట టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పండ్లూరు సమీపంలో బుధవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనాస్థలికి చేరుకున్న అర్బన్ సీఐ బాబి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మతిస్థిమితం లేకుండా గత మూడు రోజులుగా సంచరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాజన టీచర్స్ అసోసియేషన్ డైరీల ఆవిష్కరణ

డక్కిలి, జనవరి 29 : (ఆంధ్రజ్యోతి): మహజన టీచర్స్ అసోసియేషన్ ఏర్పడటం సంతోషంగా ఉందని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. అసోసియేషన్ ముద్రించిన క్యాలెండర్లు, డైరీలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జగదీష్ బాబు, ఉపాధ్యాయ యూనియన్ నాయకులు చేవూరు మస్తాన్, రాపూరు వెంకటయ్య, దూడల పెంచలయ్య తదితరులు ఉన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామికి కుంభాభిషేకం


గోపూజ నిర్వహిస్తున్న గ్రామపెద్దలు

తడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : త్రైఅమావాస్య సందర్భంగా చిన్నమాంబట్టులోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివార్లకు కుంభాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం గోపూజ జరిగింది. కార్యక్రమాలకు ఉభయదాతలుగా సుబ్బనరసయ్య-మధురిమ దంపతులు వ్యవహరించారు. తిరుపతి సిమ్స్ వైద్యుడు కారణి మునస్వామి,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వెంకటగిరిటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో స్థానిక హనుమంతు రాయి గుండు వద్ద త్రైఅమావాస్య సందర్భంగా భక్తులకు అనదానం బుధవారం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీపీ ప్రకృతికుమార్ హాజరయ్యారు. యువసైన్యం ప్రతినిధులు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గోపీనాథ్, ఫణీంద్ర, శ్యాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల అవగాహన

నాయుడుపేట టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై నాయుడుపేట అర్బన్ సీఐ బాబీ అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా బుధవారం సాయంత్రం పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాల చోదకులు అనుసరించాల్సిన నిబంధలను వివరించారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపరాదన్నారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

గిన్నిస్‌రికార్డుకెక్కిన వసంతలక్ష్మికి సత్కారం


రామకృష్ణతో కలిసి గిన్నిస్ పత్రాన్ని చూపుతున్న వసంతలక్ష్మి

వెంకటగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నిత్య యోగ సాధనతో జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. యోగాలో ప్రతిభ కనబరిచి ఇటీవల గిన్నిస్ రికార్డు సాధించిన వెంకటగిరి మహిళ చింతగింజల వసంతలక్ష్మిని బుధవారం ఆయన తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో వసంతలక్ష్మికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాట్లాడే అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, పార్టీ నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు ఉన్నారు.

వేసవి అవసరాలకు అనుగుణంగా ఉపాధి పనులు


క్షేత్ర సహాయకులతో మాట్లాడుతున్న వరప్రసాద్

కోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అవసరాలకు అనుగుణంగా పనులు గుర్తించాలని ఉపాధిహామి పథకం ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయకులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో పశువుల నీటిగుంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో పూర్ణమ, టెక్నికల్ అసిస్టెంట్‌లు శాంతి, చంద్రశేఖర్, పరుశురాం, సునీత, తదితరులు ఉన్నారు.

పేట రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాట్ల పరిశీలన


లిఫ్ట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సురేంద్ర తదితరులు

నాయుడుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటుపై సదరన్ రైల్వే కమిటీ సభ్యుడు చిగురాకుల సురేంద్ర బుధవారం పరిశీలించారు. స్టేషన్లో ఇందుకు అనుగుణంగా ఉన్న ప్రదేశాన్ని చూశారు. పరిసర ప్రాంతాలతో పాటు మేనకూరు సెజ్‌లోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగుల రాకపోకల వల్ల నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు ప్రాధాన్యత సంచరించుకుంది. దీంతో ఇక్కడి స్టేషన్‌లో లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. ఈక్రమంలో తాగునీరు, మరుగుదొడ్ల వసతులతోపాటు ప్లాట్‌ఫాం చివరి ర్యాంప్ వరకు రాకపోకల సదుపాయం ఏర్పాటు చేయాల్సి ఉందని సురేంద్ర చెప్పారు.

ఆయుర్వేద వైద్యానికి రూ.86 కోట్లు

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి (వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలను అందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో రూ.86 కోట్ల నిధులను మంజూరు చేసిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ పరిధిలోని అవిలాలలో నూతనంగా నిర్మించిన సమత ఆయుర్వేద ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం మనకు పూర్వీకులు ఇచ్చిన వరమన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో ఆయుష్ శాఖకు కేవలం రూ.33 కోట్లు మాత్రమే విడుదల చేసిందని వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆస్పత్రిలో కేవలం పట్టణ ప్రాంత వాసులకే కాకుండా గ్రామీణులకు కూడా సేవలు అందించాలని ఆస్పత్రి నిర్వాహకురాలు సమత ప్రకాష్‌కు సూచించారు. ఆయుర్వేద గార్డెన్ అభివృద్ధికి సహకారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. విశ్వధర్మపీఠం అధ్యక్షుడు సోంప్రకాష్, మాజీ మంత్రి పరసారత్నం, సామంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీల మౌలిక వసతులపై దృష్టి పెట్టండి

ఓజిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో మౌలిక వసతులు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. బుధవారం ఆమె పంచాయతీల కార్యదర్శులతో మాట్లాడారు. అభివృద్ధి ప్రణాళికలతోపాటు మౌలిక వసతుల కల్పించాలన్నారు. నిధుల లభ్యతను బట్టి తాగునీరు, విద్యుత్‌లైట్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. పంచాయతీల్లో నిధులు సద్వినియోగమయ్యేలా చూసుకోవాలని సూచించారు.

నకిలీ ఎరువులను నియంత్రించాలని ధర్నా

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులు, విత్తనాల విక్రయాలను అధికారులు నియంత్రించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాల వలన రైతులు నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు పూల చంద్రశేఖర్, వేమయ్య, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, సీపీఐ నాయకులు ప్రభాకర్, కాలేషా, శశికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

గూడూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక సాయివిద్యానికేతన్ పాఠశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో దేశభక్తి, దేశనాయకులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, ప్రవీణ్, కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

అమావాస్య పూజలు

నాయుడుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) చలివేంద్ర వద్ద వైద్య వీరరాఘవులస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అభిషేకాలు, అష్టోత్తరపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వైద్యసేవల పరిశీలన

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని ఆరోగ్యఉపకేంద్రంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాసులు వైద్యసేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. విషజ్వరాలు సోకకుండా అవగాహన పెంచాలన్నారు. డాక్టర్ జ్యోతి, నాగేంద్ర కుమార్, నరేష్‌బాబు, ప్రకాష్, మస్తానయ్య, హైమావతి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

వాకాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పంచాయతీ పల్లెపాళెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పాకం చెంగయ్య అనే వ్యక్తిని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అరెస్ట్ చేశారు. చెంగయ్య నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద హెచ్చరిక బోర్డులున్నా నిలిపి ఉన్న వాహనాలు



చెంగాళమ్మ ఆలయం వద్ద హెచ్చరిక బోర్డు వద్ద పార్కింగ్

అడిగేవారు లేరని ఆపేస్తున్నారు..

సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఎక్కడపడితే అక్కడ రోడ్డుకు అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. పోలీసులు వాహనాలు నిలపరాదని బోర్డులు పెట్టినా వాహన యజమానులు లెక్కచేయడం లేదు. ముఖ్యంగా ఆర్డీవో కార్యాలయం వెళ్లే మార్గంతో పాటు కార్యాలయ ముందు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపివేసి వెళ్తున్నారు. చీకటిపడితే ఆ బస్సుల వద్ద మందుబాబుల ఆగడాలు శ్రుతి మించుతున్నాయి. మహిళలు, విద్యార్థినులు ఆమార్గంలో వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. చెంగాళమ్మ వద్ద రోడ్డు ఇరువైపులా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పార్కింగ్‌లా వినియోగించుకొంటున్నారు. ఎక్కడ పడితే అక్కడ బస్సులు నిలిపివేసి వెళ్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. పలు సందర్భాల్లో ఎదురుగా ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో, రహదారుల వద్ద ఆపేస్తున్న వాహనాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.